తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ' తరంగాలు ' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

94949 23460



ఎడిటర్ : గడ్డం నాగరాజు

RNI . TELTEL / 2022 / 83463

జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్

మంగళవారం

06 ఫిబ్రవరి 2024

సంపుటి: 01

సంచిక: 249

పేజీలు: 8

వెల రూ.5.00

Epaper: www.tharangalu.com

Published From:Hyderabad, Circulated to: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,Sangareddy,Warangal,Kurnool,Kadapa, Amaravathi,Krishna


## ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యాన్ని విపక్ష సభ్యులు కోల్పోయారు

- కాంగ్రెస్ దుకాణంకు త్వరలో తాళం వేస్తాం
- ధన్యవాద తీర్మానం సందర్భంగా లోక్‌సభలో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా ఇవాళ లోక్‌సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నామన్నారు. కొత్త పార్లమెంట్ భవనంలో సెనగోల్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సంఘటనలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామన్నారు. విపక్షాల చర్యలు విచిత్రంగా ఉన్నాయని, సుదీర్ఘ కాలం విపక్షంలోనే ఉండాలని ఆ పార్టీలు భావిస్తున్నాయని ప్రధాని ఆరోపించారు. ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యాన్ని విపక్ష సభ్యులు కోల్పోయారని ఆయన పేర్కొన్నారు. దేశం సాధించిన ప్రగతిని రాష్ట్రపతి ముర్ము మిగతాది 2లో

## బెల్టు షాపుల

# బెల్టు తీసుడే..



### మద్యం దుకాణాలపై ఎక్సైజ్ శాఖ ఫోకస్

- బెల్టు షాపులను నియంత్రించేందుకు సన్నద్ధం
- ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ రాగానే చర్యలకు రంగం సిద్ధం
- ఇన్ని రోజులు ఎలాంటి అడ్డంకులు లేకుండా సాగిన బెల్టు వ్యాపారం..
- మంచినీళ్లు దొరకని ఊర్లు ఉన్నా, మద్యం దొరకని గ్రామమైతే లేదంటూ సెటైర్లు..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బెల్టుషాపుల రద్దుపై ప్రత్యేక దృష్టి

**డెస్క్ :** ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ రాగానే చర్యలకు రంగం సిద్ధం ఊరూరా మద్యం షాపుల జోరు.. కిరాణా షాపులతో పోటీపడి నడుస్తున్న బెల్టు షాపులు.. 24 గంటలు మద్యం బాబులకు అందుబాటులో లిక్కర్.. ఎలాంటి అడ్డంకులు లేకుండా సాగిన బెల్టు వ్యాపారం.. మంచినీళ్లు దొరకని ఊర్లు ఉన్నా, మద్యం దొరకని గ్రామమైతే లేదంటూ సెటైర్లు.. కూలీనాలి చేసి సంపాదించిందంతా ఆ షాపులకే పోతుందని మహిళల ఆవేదన.. ఇప్పుడిక ఈ పరిస్థితులు మారనున్నాయి. ప్రస్తుతం కొలువుదీరిన కొత్త మిగతాది 2లో





## మేం పదవుల కోసం పెదవులు మూసుకోలేదు

- సీఎం రెచ్చగొట్టినా.. మేం రెచ్చిపోం
- సన్నద్ధత కాకుండా వస్తే అడ్డంగా దొరికిపోతారు
- తెలంగాణకు అన్యాయం చేస్తే పదవులను గడ్డిపోచల్లా వదిలేశాం
- ప్రాజెక్టులను అప్పగించడం నిజం కాకపోతే ఎందుకు స్పందించలేదు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

**తరంగాలు/ హైదరాబాద్ :** తెలంగాణ హక్కుల కోసం పోరాడేందుకు మేము సిద్ధంగా ఉన్నామని అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. మేం ప్రజలపక్షమే అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ మీడియా మిగతాది 2లో

## జగన్‌ను భరించే స్థితిలో ప్రజలు లేరు

- పిచ్చోడి చేతికి అధికారం ఇచ్చారు
- సీఎం జగన్ అన్నీ వ్యవస్థలను భ్రష్టుపట్టించారు
- రా.. కదలిరా కార్యక్రమంలో చంద్రబాబు



**తరంగాలు/ విశాఖపట్నం:** పిచ్చోడి చేతికి అధికారం ఇచ్చారని.. ఏపీ సీఎం జగన్‌ను ఉద్దేశించి తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. సోమవారం ఏలూరులోని చింతలపూడి సభలో "రా.. కదలిరా" కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సభకు కార్యకర్తలు, నేతలు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... జగన్‌ను భరించే స్థితిలో ప్రజలు లేరన్నారు. మళ్లీ ఇటుక.. ఇటుక పేర్చుకుని రాష్ట్రాన్ని నిర్మించుకుందామని తెలిపారు. మందుబాబుల దగ్గర జలగలాగా జగన్ పైసలను దోచేస్తున్నారని చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు రూ.లక్షల కోట్లు దోచేశారని మండిపడ్డారు. జగన్ అర్జునుడు కాదు.. అక్రమార్జునుడని ఆరోపించారు. దేశ రాజకీయాల్లో ఇంత అక్రమార్జునుడిని చూడలేదని మిగతాది 2లో

## ఇదేనా ఎన్నికలు నిర్వహించే తీరు

- ప్రజాస్వామ్యాన్ని హత్య చేశారు
- చండీగఢ్ మేయర్ ఎన్నికల ఫలితాలపై సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు



**చండీగఢ్:** చండీగఢ్ మేయర్ ఎన్నికల ఫలితాలపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడాన్ని అనుమతించేది లేదని, రిటర్నింగ్ అధికారి చేసిన పనికి విచారణ జరపాలని ఆదేశాలు జారీ చేసింది. పోలింగ్ అధికారి ఒకరు బ్యాలెట్లను తారుమారు చేశారని సుప్రీంకోర్టు తెలిపింది. ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్‌లు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు మేయర్ ఎన్నికలు జరిగిన తీరు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని వ్యాఖ్యానించింది. ఇదేనా రిటర్నింగ్ అధికారి ప్రవర్తన? అని ఘాటుగా ప్రశ్నించింది. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వీడియోను చూసిన అనంతరం చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. "కెమెరాలో చూస్తూ బ్యాలెట్ పేపర్ పాడుచేస్తున్నట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. ఇదేనా ఎన్నికలు నిర్వహించే తీరు. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే".. అని ఆగ్రహం మిగతాది 2లో

## ఈసారి మరింత బలంగా తిరిగి వస్తా..

- వ్యాపారాలు చేసుకున్నా రాజకీయ వేధింపులు అధికమవుతున్నాయి
- టీడీపీ హయాంలో 75శాతం పూర్తయిన పోలవరం..
- ఇప్పుడు ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న చంధంగా తయారైంది
- గల్లా జయదేవ్ కీలక వ్యాఖ్యలు




**తరంగాలు/ అమరావతి:** రాజకీయాల్లో ఉండే వ్యాపారవేత్తలకు వేధింపులు తగవని ఎంపీ గల్లా జయదేవ్ అన్నారు. సోమవారం లోక్‌సభలో మాట్లాడుతూ.. రాముడు 14 సంవత్సరాల వనవాసం తర్వాత తిరిగొచ్చినట్లు తానూ మళ్లీ రాజకీయాల్లో వస్తానని.. ఈసారి మరింత బలంగా తిరిగి వస్తానని స్పష్టం చేశారు. రాజకీయాలకు తాత్కాలికంగా మాత్రమే దూరమవుతున్నానని తెలిపారు. రాజకీయాల్లో తను కొనసాగాలనుకోకపోవడానికి ప్రధాన కారణం రెండు మిగతాది 2లో

## ఎంపీ టికెట్ల కోసం

# పోటాపోటీ

- ఎంపీ సీట్ల కోసం కుటుంబాల పోటీ
- బంధువర్గం నుంచి రంగంలోకి కొత్తతరం నేతలు






**తరంగాలు/హైదరాబాద్:** పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ పార్టీలో రాజకీయాలు మరింత వేడెక్కుతున్నాయి. ఎంపీ సీట్ల కోసం పలు కుటుంబాలు పోటీ పడుతుండటం.. కొందరు ఆశావహులు ఆయా సీట్లను ఆశిస్తుండటం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే రాజకీయాలలో ఉన్న ఆ నేతలకు తమ బంధువర్గం నుంచి కొత్తతరం నేతలను రంగంలోకి దింపే ప్రయత్నం చేస్తున్నారు.. ఒకటి రెండు కుటుంబాల నుంచి నేతలు దరఖాస్తు చేయడంతో మిగతా నేతలు కూడా తమవారికి టికెట్ ఇవ్వాలని పట్టు బడుతున్నారు.. ఈ లిస్ట్‌లో కొత్త నేతలతో పాటు తలపండిన నేతలు కూడా ఉన్నారు. ఖమ్మం ఎంపీ టిక్కెట్ కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందిని దరఖాస్తు చేసుకున్నారు. తనకే టిక్కెట్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక మరో మంత్రి మిగతాది 2లో

## ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్ తీవ్ర అన్యాయం చేసింది

- తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుంది
- అబద్దపు హామీలతో కాంగ్రెస్ తెలంగాణలో అధికారం దక్కించుకుంది
- వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు



**తరంగాలు/అమరావతి :** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తొందరలోనే కూలిపోతుందని వ్యాఖ్యానించారు. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం వైసీపీ తరఫున విజయసాయి రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా మిగతాది 2లో

## ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యాన్ని విపక్ష సభ్యులు కోల్పోయారు

– మొదటి పేజీ తరువాయి

తన ప్రసంగంలో వినిపించారన్నారు. దేశానికి చెందిన నాలుగు స్తంభాలను తన ప్రసంగంలో ఆమె ఫోకస్ చేశారన్నారు. పిల్లర్లు ఎంత దృఢంగా ఉంటే, దేశం అంత వేగంగా వృద్ధి సాధిస్తుందని రాష్ట్రపతి భావించినట్లు ప్రధాని వెల్లడించారు. దేశంలో విపక్షం బలహీనంగా ఉండటానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని ఆయన అన్నారు. గడిచిన పదేళ్లలో బలమైన ప్రతిపక్షంగా మారేందుకు కాంగ్రెస్ పార్టీకి అవకాశం వచ్చిందని, కానీ వాళ్లు ఏమాత్రం ఎదగలేదని, అంతేకాదు ఇతర విపక్ష పార్టీలను కూడా ఎదగకుండా చేశారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దుకాణాన్ని మూసివేస్తున్నామని, త్వరలోనే ఆ దుకాణంకు తాళాలు వేస్తామన్నారు. మరోసారి ప్రధాని మోదీ కుటుంబ పాలనపై సీరియస్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీ తన కుటుంబానికి మించి ఎక్కువగా ఆలోచించలేకపోయిందన్నారు. ప్రపంచంలో భారత్ మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని, ఇది మోదీ గ్యారెంటీ అంటూ తెలిపారు.

## మేం పదవుల కోసం పెదవులు మూసుకోలేదు

– మొదటి పేజీ తరువాయి

సమావేశంలో వితండవాదం తప్ప మరేమి లేదు అని హరీశ్‌రావు మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణాలకు పాల్పడ్డారు. సీఎం సన్నద్ధత కాకుండా మీడియా సమావేశం పెట్టారు. సన్నద్ధత కాకుండా వస్తే అడ్డంగా దొరికిపోతారు. మేం మంత్రులుగా ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడు జీవో వచ్చిందని రేవంత్ అన్నారు. మేం రాజీనామా చేసి బయటకు వచ్చిన 3 నెలలకు జీవో వచ్చింది. తెలంగాణకు అన్యాయం చేస్తే పదవులను గడ్డిపోచల్లా వదిలేశాం. పోతిరెడ్డిపాడు కోసం వైఎస్ 2005, సెప్టెంబర్ 13న జీవో తెచ్చారు. 2005, డిసెంబర్ 19వ తేదీన వైఎస్ మరోసారి జీవో తెచ్చారు. మేం 2005, జులై 4న వైఎస్ సర్కార్ నుంచి బయటకు వచ్చాం. మేం పదవుల కోసం పెదవులు మూసుకోలేదు. పదవుల కోసం పెదవులు మూసుకున్నది రేవంత్, ఆయన మంత్రులే. పోతిరెడ్డిపాడు జీవోకు వ్యతిరేకంగా అసెంబ్లీని స్తంభింపజేశాం అని హరీశ్‌రావు గుర్తు చేశారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించేది లేదని ప్రభుత్వం రంకెలేస్తుంది. కేఆర్ఎంబీలో ప్రాజెక్టులను అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ, ఏపీ అధికారులు డ్యామ్‌పైకి వెళ్లాలంటే కేఆర్ఎంబీ అనుమతి కావాలి. ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతను కేఆర్ఎంబీకి ఇచ్చేందుకు అధికారులు ఒప్పుకున్నారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించారని పత్రికల్లో వార్తలొచ్చాయి. వార్తలు తప్పు అయితే ప్రభుత్వం ఎందుకు వివరణ ఇవ్వలేదు. ప్రాజెక్టులను అప్పగించడం నిజం కాకపోతే ఎందుకు స్పందించలేదు. రాష్ట్ర ప్రయోజనాలపై రేవంత్ రెడ్డికి సోయిలేదు. కేఆర్ఎంబీ సమావేశంలోనే ప్రాజెక్టులను అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించారు కాబట్టే.. ఉద్యోగులు, వారికిచ్చే జీతాల ప్రస్తావన వచ్చింది. కేఆర్ఎంబీ ప్రాజెక్టులు అప్పగించి దాన్ని మాయ చేసేందుకు రేవంత్ డ్రామాలు ఆడుతున్నారు. కీలకమైన కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతకు సంబంధించిన మినిట్స్‌ను చెక్ చేసుకోవాలన్న సోయి కూడా లేదా..? మినిట్స్ తప్పుగా రాశారని చెప్పడం తప్పును కప్పిపుచ్చుకునే చర్య. ఒక తప్పును కప్పిపుచ్చుకునేందుకు మళ్లీ మళ్లీ తప్పులు చేస్తున్నారు. రేవంత్ సర్కార్ డ్రామాలు ప్రజలకు తెలిసిపోయాయి. అందుకే కేసీఆర్‌పై బురద జల్లేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారు. ప్రాజెక్టులను అప్పగిస్తూ కేసీఆరే సంతకం చేశారని సీఎం చెప్పారు. అసలు కేఆర్ఎంబీ సమావేశానికి కేసీఆర్ హాజరుకాలేదు. ఇంతకంటే అబద్దాల ముఖ్యమంత్రి ఉంటారా.. అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై కేసీఆర్ స్పందించలేదని సీఎం చెప్పారు. రాయలసీమ ఎత్తిపోతలపై స్టే తీసుకొచ్చిందే బీఆర్ఎస్ కదా..? కృష్ణాలో మన నీటి వాటా కోసం కేసీఆర్ పదేండ్లు పోరాడారు. సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలు చెబుతున్నారు. రేవంత్ అబద్దాలను ప్రజలు గుర్తించాలి. నాడు పోతిరెడ్డిపాడు విషయంలో రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి నోరు మెదపలేదు. పదవుల కోసం పార్టీ మారిన చరిత్ర మీది. ప్రజల కోసం త్యాగాలు చేసిన చరిత్ర మాది. పదవుల కోసం పెదవులు మూసుకున్న చరిత్ర మీది. ప్రభుత్వాలు రాజకీయాలకు అతీతంగా పని చేయాలి. తెలంగాణకు అన్యాయం చేస్తుంటే పదవులను గడ్డిపోచల్లా వదిలేశాం. రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే బీఆర్ఎస్ ప్రాధాన్యత. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రభుత్వంతో కలిసి వస్తామని హరీశ్‌రావు అన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్ తీవ్ర అన్యాయం చేసింది

– మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేసిందని విజయసాయిరెడ్డి విమర్శించారు. అన్యాయంగా రాష్ట్రాన్ని విభజించారని ఆరోపించారు. అందుకే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేండ్ల దాకా ఆ పార్టీకి అధికారం దక్కలేదని విమర్శించారు. ఇప్పుడు కూడా అబద్ధపు హామీలు ఇవ్వడం వల్లనే కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు అధికారం అప్పగించారని తెలిపారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తొందరలోనే కూలిపోతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నేతలు ప్రత్యేక హోదాపై మాట్లాడటాన్ని విజయసాయి రెడ్డి తప్పుబట్టారు. ఏపీపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే విభజన చట్టంలోనే ప్రత్యేక హోదా చేర్చేవారని అన్నారు.

## ఇదేనా ఎన్నికలు నిర్వహించే తీరు

– మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేశారు. పంజాబ్, హర్యానా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ద్వారా బ్యాలెట్ పేపర్లు, వీడియోగ్రఫీ సహా ఎన్నికల ప్రక్రియ మొత్తం రికార్డును భద్రపరచాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. చండీగఢ్ కార్పొరేషన్ తదుపరి సమావేశాన్ని తదుపరి విచారణ తేదీకి వాయిదా వేయాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. కాగా.. లోక్‌సభ ఎన్నికల ముందు తొలి పరీక్షగా భావించిన చండీగఢ్ మేయర్ ఎన్నికలో 'ఇండియా' కూటమి ఓటమి పాలైంది. బీజేపీ అభ్యర్థి మనోజ్ సోన్కర్ విజయం సాధించారు. మొత్తం 35 సీట్లున్న కౌన్సిల్‌లో బీజేపీకి 14 మంది, ఆప్‌నకు 13, కాంగ్రెస్‌కు 7, శిరోమణి అకాలీదళ్‌కు ఒక సభ్యుడి బలం ఉంది. అయితే 8 మంది సభ్యులను ఓటింగ్‌లో పాల్గొనకుండా ప్రిసైడింగ్ అధికారి అనర్హుల్ని చేయడంతో బీజేపీ అభ్యర్థికి 15 ఓట్లు, ఇండియా కూటమి అభ్యర్థికి 12 ఓట్లు వచ్చాయి. ఫలితాలు వెలువడిన వెంటనే కాంగ్రెస్, ఆప్ సభ్యులు నిరసనకు దిగారు.

# బెల్టు షాపుల బెల్టు తీసుడే..

– మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం ఈ లెక్కలను మార్చేందుకు సిద్ధమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బెల్టుషాపుల రద్దుపై ప్రత్యేక దృష్టి పెట్టగా అందుకు అనుగుణంగా ఎక్సైజ్ అధికారులు సన్నద్ధమవుతు న్నారు. బెల్టుషాపులపై కొరఢా ఝులిపించేందుకు ఇప్పటికే అధికారులు సిద్ధం అయ్యారు. ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ రాగానే తమ కార్యాచరణ మొదలు పెట్టబోతున్నారు. ప్రభుత్వం ఈ లెక్కలను మార్చేందుకు సిద్ధమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బెల్టుషాపుల రద్దుపై ప్రత్యేక దృష్టి పెట్టగా అందుకు అనుగుణంగా ఎక్సైజ్ అధికారులు సన్నద్ధమవుతున్నారు. బెల్టుషాపులపై కొరఢా ఝులిపించేందుకు ఇప్పటికే అధికారులు సిద్ధం అయ్యారు. ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ రాగానే తమ కార్యాచరణ మొదలు పెట్టబోతున్నారు.

**– బెల్టుషాపులపై నజర్..**

గత ప్రభుత్వ పాలనలో బెల్టుషాపులపై ఎలాంటి ఆంక్షలు విధించకపోవడంతో వాటి సంఖ్య విపరీతంగా పెరిగింది. మరో వైపు ఎక్సైజ్ శాఖ ద్వారా వచ్చే ఆదాయం ప్రభుత్వానికి కీలకం కావడంతో అమ్మకాలు పెంచడంపై గత ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో బెల్టుషాపులను ప్రోత్సహించిందే తప్ప వాటి కట్టడికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో గ్రామాల్లో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. జనగామ జిల్లాలో సుమారుగా ఒక్కో గ్రామానికి 3 నుంచి 5 బెల్టు షాపులు నడుస్తున్నాయి. ఇక గతంలో కొన్ని గ్రామాల్లో అయితే టెండర్ తరహాలో బెల్టుషాపులను కట్టబెట్టారు. రూ. 2లక్షల నుంచి రూ. 5లక్షల వరకు గ్రామ పంచాయతీకి డబ్బులు కట్టి గ్రామంలో ఒకరే బెల్టుషాపు నిర్వహించేలా ఒప్పందాలు సైతం జరిగాయి. అలాంటి గ్రామాల్లో బెల్టుషాపులకు వైన్ షాపు కంటే ఎక్కువగా డిమాండ్ ఉండేది. గ్రామాల్లో మద్యం సేల్స్ ఏ స్థాయిలో ఉంటాయనే దానికి ఇది నిదర్శనం. మండల కేంద్రాల్లో ఉండే వైన్ షాపులు బెల్టుషాపులకు సరుకు విక్రయిస్తున్నాయి. ఒకటి కంటే ఎక్కువగా వైన్ షాపులు ఉన్న చోట సిండికేట్‌గా మారి బెల్టుషాపులకు వారి గుర్తింపుతో కూడిన స్టిక్కర్లు వేసి మరీ స్టాక్ ఇస్తుంటారు. ఇన్ని రోజులు ప్రభుత్వమే వాటి నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎక్సైజ్ అధికారులు ఏమీ చేయలేకపోయారు. ప్రస్తుతం కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరడంతో బెల్టుషాపుల నిర్వాహకుల్లో కంగారు మొదలైంది. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ బెల్టుషాపుల రద్దు అంశాన్ని పొందుపరిచింది. దీనికి తోడు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇప్పటికే గ్రామాల్లో ఒక్క బెల్టుషాపు కూడా కనిపించొద్దని ఆయన ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఎక్సైజ్ శాఖ ఇప్పటికే బెల్టుషాపులపై ఫోకస్ పెట్టింది. గ్రామాల్లో ఎక్కడెక్కడా బెల్టుషాపులు నడిపిస్తున్నారో లెక్కలు తీస్తోంది. ఏ క్షణంలోనైనా ప్రభుత్వం నుంచి దీనిపై గైడ్‌లైన్స్ వచ్చే అవకాశం ఉండడంతో ఆబ్కారీ అధికారులు అప్రమత్తమయ్యారు.

**– ఒక్కో మండలంలో 250కి పైగా బెల్టుషాపులు..**

ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు జరిగిన విషయం విదితమే. ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే నిబంధనల ప్రకారం ఎక్సైజ్ అధికారులు బెల్టుషాపులను తూతూ మంత్రంగా మూసివేయించారు. ఆ సమయంలో మండలంలో 250కి పైగా బెల్టుషాపులు ఉన్నట్లు గుర్తించి చాల మందిని బైండోవర్ చేశారు. ఎన్నికల కోడ్ ముగిశాక ఈ షాపులన్నీ మళ్లీ తెరుచుకున్నాయి. వీటికి తోడు మరేమైనా కొత్తగా షాపులు ఏర్పా టు చేశారా?.. ఎక్కడెక్కడ ఎవరెవరు బెల్టుషాపులను నడిపిస్తు న్నారు..? అనే అంశాలపై ఎక్సైజ్ అధికారులు ఆరా తీస్తున్నారు. బెల్టు షాపుల రద్దుకు ప్రభుత్వం గైడ్‌లైన్స్ రాగానే 24 గంటల్లో షాపులు మూతపడేలా ఇప్పటికే కార్యాచరణ రూపొందిస్తున్నారు.

**– తలలు పట్టుకుంటున్న యజమానులు..**

తెలంగాణ ప్రభుత్వం బెల్టుషాపుల రద్దుపై దూకుడుగా ఉండడంతో వైన్‌షాపు యజమానులు తలలు పట్టుకుంటున్నారు. ఎందుకంటే దాదాపు సగం సేల్స్ బెల్టుషాపుల ద్వారానే నడుస్తాయి. ఎలాంటి రిస్క్ లేకుండా పెద్ద మొత్తంలో సరుకును బెల్టుషాపులకు విక్రయించడంతో పాటు అమ్మకాలు ఆశించిన స్థాయిలో ఉండేవి. మరోవైపు వినియోగదారుడికి నేరుగా అమ్మితే ఎంఆర్‌పీకి విక్రయించాలి. అదే బెల్టుషాపు వారికి అయితే వైన్ షాపు నిర్వాహకులు ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ. 10 మార్జిన్‌తో విక్రయిస్తారు. బెల్టుషాపులో అదనంగా రూ. 20 మార్జిన్ కలిపి ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు రూ. 30 ఎక్కువకు విక్రయిస్తుంటారు. ఎన్నికల కోడ్ రావడానికి నెల రోజుల ముందే అధికారులు మద్యం షాపుల టెండర్లు నిర్వహించారు. షాపు లైసెన్సులు ఇటీవల అందుబాటులోకి రాగా కొత్తగా షాపులను ముస్తాబు చేసి అమ్మకాలు ప్రారంభించారు. అయితే.. ఆకస్మికంగా ప్రభుత్వం బెల్టుషాపుల రద్దుపై నిర్ణయం తీసుకోవడంతో లిక్కర్ సేల్స్ గతం కంటే భారీగా తగ్గుతాయని వారు ఆందోళన చెందుతున్నారు. ఏదిఏమైనా ప్రభుత్వ నిర్ణయంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**– సిబ్బంది సరిపోతారా..?**

బెల్టుషాపుల రద్దు నిర్ణయం ఒక ఎత్తయితే అది అమలు చేయడం మరోఎత్తు. బెల్టు షాపులను కట్టడి చేయాలంటే నిత్యం ఆబ్కారీ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ పర్యవేక్షించాల్సి ఉంటుంది. ప్రస్తుతం నియోజకవర్గం మొత్తానికి 15 మంది వరకు స్టాఫ్ ఉన్నారు. ఒక్కో నియోజకవర్గానికి కనీసం మరో ఐదారు మంది సిబ్బందినైనా కేటాయిస్తే బాగుంటుందనే అభిప్రాయం ఎక్సైజ్ శాఖ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

## జగన్‌ను భరించే స్థితిలో ప్రజలు లేరు

– మొదటి పేజీ తరువాయి

చెప్పారు. కలియుగంలో జగన్ బకాసురుడని మొత్తం మింగేస్తున్నారన్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజల నడ్డి విరిచారని ధ్వజమెత్తారు. రూ. 64 వేల కోట్ల మేర విద్యుత్ ఛార్జీలు పెంచారని చంద్రబాబు మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వానికి ఇక 64 రోజులే గడువుందని.. ఆ పార్టీ ఇంటికి వెళ్లడం ఖాయమని.. టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. యువత ఎటువైపు ఉంటే.. అటువైపే గెలుపు ఉంటుందని తెలిపారు. ఈ ఎన్నికలు టీడీపీ – జనసేన కూటమికి కాదని.. రాష్ట్ర భవిష్యత్ కోసం జరిగే ఎన్నికలని చెప్పారు. ఈ ఎన్నికలు రాష్ట్రాభివృద్ధికి అవసరమని తెలిపారు.

# క్రమంగా చల్లబడుతున్న వైసీపీ నేతలు



**తరంగాలు/ఆంధ్రప్రదేశ్ :** వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటివరకూ 6 విడతల్లో మొత్తం 64 అసెంబ్లీ స్థానాలకు ఇన్‌ఛార్జ్‌లను నియమించారు. లోక్ సభకు సంబంధించి 16 మందిని ఇన్‌ఛార్జ్‌లుగా ప్రకటించారు. మరిన్ని మార్పులు కూడా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఈ క్రమంలో అసంతృప్తి స్వరం వినిపించిన పలువురు నేతలు క్రమంగా చల్లబడుతున్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని.. అధిష్ఠానం ఎంపిక చేసిన అభ్యర్థి విజయానికి పనిచేస్తామని ప్రకటిస్తున్నారు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో సిట్టింగ్ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు స్థానంలో.. మంత్రి మేరుగు నాగార్జునకు కేటాయించింది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ. ఈ క్రమంలో అలక వహించిన సుధాకర్‌బాబు గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారన్న ప్రచారం జరిగింది. అయితే ఆ ప్రచారాన్ని కొట్టిపారేశారు సుధాకర్ బాబు. టికెట్ విషయంలో అధిష్ఠానం మాటే వేదమని.. జగన్‌ను మళ్లీ సీఎం చేసేందుకు శతవిధాలా కృషి చేస్తానని ప్రకటించారు. అటు పి.గన్నవరం ఎమ్మెల్యే చిట్టిబాబు కూడా చల్లబడ్డారు. మార్పుల్లో భాగంగా పి.గన్నవరం స్థానాన్ని విప్పర్తి వేణుగోపాల్‌కు ఇచ్చింది అధిష్ఠానం. దీంతో అప్పటినుంచి అసంతృప్తిగా ఉన్నారు చిట్టిబాబు. ఈ క్రమంలో భవిష్యత్‌లో తగిన ప్రాధాన్యత ఇస్తానని చిట్టిబాబుకు భరోసా ఇచ్చారు..సీఎం జగన్. దీంతో సంతృప్తి వ్యక్తం చేసిన చిట్టిబాబు.. వైసీపీ విజయం కోసం చివరి వరకూ జెండా మోస్తానని ప్రకటించారు. పి.గన్నవరంలో వైసీపీ విజయానికి కృషిచేస్తానని స్పష్టం చేశారు. ఇప్పటివరకూ కాస్త అసంతృప్తి అనిపించిన ఈ రెండు నియోజకవర్గాల్లో నేతలతో మాట్లాడి ఒప్పించారు.

# రేవంత్ ధోరణి చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు

- **ఎన్ని గంటల చర్చకైనా మేము సిద్ధం**
- **రేవంత్ రెడ్డిపై హరీష్ రావు ఆగ్రహం..**



**తరంగాలు/హైదరాబాద్:** నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు మాజీ మంత్రి హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. ఎన్ని గంటల చర్చకైనా తాము సిద్ధమని రేవంత్‌రెడ్డి పక్కాగా ప్రిపేర్ అయి రావాలని సూచించారు. అయితే, తాము తప్పు చేస్తే.. రెండు నెలలుగా మీరేం చేస్తున్నారంటూ హరీశ్ ప్రశ్నించారు. సోమవారం మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. సీఎం రేవంత్ భాష అభ్యంతరకరంగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌పై నీచమైన భాష మాట్లాడటం దారుణమన్నారు. కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణలు చేశారని.. సీఎం రేవంత్ ధోరణి చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారంటూ విమర్శించారు. ప్రాజెక్ట్‌ను అప్పగించేది లేదని ప్రభుత్వం అంటోంది.. కానీ ప్రాజెక్ట్‌లను కేఆర్ఎంబీకి అప్పగిస్తూ.. ప్రభుత్వం నిర్ణయం తీసుకుందంటూ హరీష్‌రావు పేర్కొన్నారు. ప్రాజెక్ట్‌లు అప్పగించడం నిజం కాకపోతే.. ఎందుకు ఖండించలేదంటూ ప్రశ్నించారు. కేఆర్ఎంబీ మీటింగ్‌లో ప్రాజెక్టులు అప్పగించడానికి అంగీకరించారని.. అందుకే వివాదం మొదలైందంటూ హరీష్ రావు వివరించారు. జనవరి 17న ఢిల్లీలో జరిగిన మీటింగ్‌లో ప్రాజెక్టుల అప్పగింతకు ఆమోదం తెలిపారని.. మినిట్స్‌లో అది స్పష్టంగా ఉందని.. అయినా రాష్ట్ర ప్రభుత్వానికి ఉలుకు పలుకు లేదన్నారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించాలని నిర్ణయం తీసుకున్నట్లు రెండు రాష్ట్రాల ఈఎన్సీలు చెప్పారని.. కేసీఆర్ ఉన్నంత వరకు ప్రాజెక్టులు అప్పగించలేదని.. కాంగ్రెస్ వచ్చాకే ప్రాజెక్టులు కేంద్రం చేతిలో పెట్టిందంటూ విమర్శించారు. అబద్దాల పునాదుల మీద ప్రభుత్వాన్ని నడపాలని అనుకుంటున్నారన్నారని.. ఇది శాంపిల్ మాత్రమే అని అసెంబ్లీలో పూర్తి వివరాలు చెబుతామంటూ హరీష్ రావు పేర్కొన్నారు.

## ఎంపీ టికెట్ల కోసం పోటాపోటీ

– మొదటి పేజీ తరువాయి

పొంగులేటి శ్రీనివాసరెడ్డి తమ్ముడు ప్రసాద్ రెడ్డి కూడా ఖమ్మం ఎంపీ టిక్కెట్ కోసం దరఖాస్తు చేసారు. ఇలా ఇద్దరు మంత్రుల కుటుంబాల నుంచి ఒకే టిక్కెట్ కోసం పోటీ పడుతుండటం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. మరో నేత జానారెడ్డి కుమారుడు రణవీర్ రెడ్డి కూడా నల్లగొండ ఎంపీ టిక్కెట్ కోసం దరఖాస్తు చేసారు. జానారెడ్డి రెండో కుమారుడు నాగార్జున సాగర్ ఎమ్మెల్యేగా ఉన్నారు.. కాగా ఇదే టిక్కెట్‌ను కోమటిరెడ్డి ఫ్యామిలీ కూడాఅడుగుతుందట.. టిక్కెట్‌కు ఓకే చెప్తే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి లేదంటే తమ కుటుంబం నుంచే మరోనేతను దింపుతామని చెప్తున్నారని పార్టీలో చర్చ జరుగుతోంది. కోమటిరెడ్డి కుటుంబం నుంచి వెంకట్‌రెడ్డి మంత్రిగా.. రాజగోపాల్ రెడ్డి ఎమ్మెల్యేగా ప్రస్తుతం ఉన్నారు. ఇక మరోనేత భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కూతురు కీర్తిరెడ్డి కూడా భువనగిరి ఎంపీ టిక్కెట్ ఆశిస్తున్నారు.. ఇప్పటికే గాంధీ భవన్‌లో దరఖాస్తు చేసుకున్న కీర్తి రెడ్డి టిక్కెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. మల్కాజ్‌గిరి టిక్కెట్ కోసం మైనంపల్లి హన్మంతరావు దరఖాస్తు చేసుకోగా మైనంపల్లి కొడుకు ప్రస్తుతం మెదక్ ఎమ్మెల్యేగా ఉన్నారు. నాగర్ కర్నూలు ఎంపీ టిక్కెట్ కోసం మల్లు రవి దరఖాస్తు చేసుకున్నారు. మల్లు రవి బ్రదరే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సికింద్రాబాద్ టిక్కెట్ కోసం అనీల్ యాదవ్ దరఖాస్తు చేసుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అనీల్ తండ్రి అంజన్ ముషీరాబాద్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. మరోమంత్రి దామోదర రాజనర్సింహ కూతురు త్రిష మెదక్ టికెట్ ఆశిస్తుండగా.. జగ్గారెడ్డి కూతురు జయారెడ్డి కూడా ఆ టిక్కెట్‌నే ఆశిస్తున్నారని సమాచారం..అయితే, ఈ ఇద్దరు నేతలు దరఖాస్తు చేయలేదు.. కానీ టిక్కెట్ మాత్రం అడుగుతున్నారని గాంధీ భవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## ఈసారి మరింత బలంగా తిరిగి వస్తా..

– మొదటి పేజీ తరువాయి

పడవలపై ప్రయాణించదలచుకోకపోవడమేనని.. తనకు అనేక పరిమితులు కూడా ఉన్నాయని అన్నారు. రాజకీయ ప్రక్రియలో వ్యాపారవేత్తలు చాలా ముఖ్యమైన భాగమని భావిస్తున్నానని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యాపారవేత్తలు రాజకీయాల్లో భాగం కావాలని ప్రోత్సహిస్తారని.. మన దేశంలో ఆ పరిస్థితి లేదని తన మనసులోని మాటను పంచుకున్నారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వ్యాపారవేత్తలైన రాజకీయనేతలు మాట్లాడితే వారి కంపెనీలపై ప్రతీకార దాడులు జరగడం దురదృష్టకరమన్నారు. చట్టాలకు లోబడి వ్యాపారాలు చేసుకున్నా రాజకీయ కారణాలతో వేధింపులు అధికమవుతున్నాయన్నారు. ప్రస్తుత లోక్‌సభలో 20% మంది వ్యాపారవేత్తలున్నారు...వారందరిదీ తనలాంటి ఆవేదనేనని తెలిపారు. విభజన హామీలను అమలు చేయాలని.. పోలవరం సవరించిన అంచనాలను ఆమోదించాలని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 75శాతం పూర్తయిన పోలవరం.. ఇప్పుడు ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న చందంగా తయారైందని గల్లా జయదేవ్ అన్నారు.

# ప్రపంచవ్యాప్తంగా మరణాలలో 10 ఇంటిలో ఏడు మరణాలకు క్యాన్సర్ కారణం

- **క్యాన్సర్ నిర్మూలనకు అంతర్జాతీయ స్థాయి అవగాహన స్థానిక నివారణ చర్యలు కీలకమైనవి**
- **అవగాహన పెంచడం, నివారణ చర్యలు వేగవంతం చేయడం, జీవనశ్కైలిని మార్చుకోవడం లక్ష్యంగా నిర్వహించబడుతున్న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం**
- **నిర్మూలనకు నివారణకు ఆత్మస్థైర్యంతో ఆలంబనగా నిలబడదాం**

**డెస్క్:** ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న మరణాలలో 10 ఇంటిలో ఏడు మరణాలు క్యాన్సర్ వల్లనే కావడం ఆందోళన కలిగించే విషయం. క్యాన్సర్ భయంకరమైన రోగమని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన తర్వాత ఆ భయము నుండి విముక్తి పొందడానికి సమాచారాన్ని సేకరించడం అవగాహన పెంచుకోవడం కీలకంగా ఉండడం కోసం క్యాన్సర్ బారిన పడినటువంటి వారికి మద్దతునిచ్చి ఆత్మస్థైర్యాన్ని పెంచడం కోసమే ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం. 2000 సంవత్సరం ఫిబ్రవరి 4వ తేదీన ఫ్రాన్స్ రాజధాని పారిస్ లో జరిగిన ప్రపంచ క్యాన్సర్ సమ్మిట్ లో కీలక నిర్ణయం తీసుకోవడం ఆనాటి నుండి గత 24 సంవత్సరాలుగా నిరంతరాయంగా కొనసాగడం ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ను అరికట్టడానికి జరుగుతున్న కృషిలో అగ్ర భాగం అని చెప్పక తప్పదు. ఆ సమావేశం పరిశోధనలు ప్రోత్సహించడానికి, క్యాన్సర్ నుండి విముక్తికీ రోగులకు అందవలసిన సేవలను మరింత మెరుగుపరచడానికి తోడ్పడాలని ఉద్దేశంతో చార్టర్ ఆఫ్ పారిస్ అగైన్స్ట్ క్యాన్సర్ పత్రంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంగా ప్రారంభించే అంశాన్ని కూడా చేర్చడం అదే రోజు యునెస్కో డైరెక్టర్ ఆమోదించడంతో నిరంతరాయంగా కొనసాగుతున్నట్లు పరిశీలన ద్వారా తెలుస్తున్నది. 2009 నుండి 2024 వరకు ప్రతి మూడేళ్ల కు ఒక్కసారి అంతర్జాతీయ దినోత్సవానికి బలమైన థీమ్ ను ఎంపిక చేసినట్లుగా దీనికి సంబంధించిన చరిత్ర ద్వారా తెలుస్తున్నది.

- 2009- 10 సంవత్సరాలలో "నేను నా ఆరోగ్యకరమైన చురుకైన బాల్యాన్ని ప్రేమిస్తున్నాను" అనే నినాదం స్పష్టంగా ప్రపంచవ్యాప్తంగా మారుమోగింది .

2010 -11 సంవత్సరాలలో "క్యాన్సర్ ను నివారించవచ్చు" అనే నినాదం ప్రధాన ఎజెండాగా మారినది.

2012 సంవత్సరాన్ని "కలిసి మనం ఏద్కైనా చేద్దాం" అనే థీమ్తో క్యాన్సర్ నిర్మూలనకు చర్యలు చేపట్టినట్లు తెలుస్తున్నది.


2013 సంవత్సరానికి ప్రధాన ఎజెండాగా "క్యాన్సర్ అపోహలు వాస్తవాలను తెలుసుకుందాం" గా నిర్ణయించినారు .

2014 సంవత్సరాన్ని "అపోహలను తొలగించండి " అనే థీమ్తో ఎత్తిచూపగా 2017 సంవత్సరానికి నాట్ బియాండ్ అజ్ అని నినదించారు. 2016 నుండి 18 సంవత్సరాల మధ్యన "మనం చేయగలం నేను చేయగలను" అనే ధైర్యంతో నివారించే ప్రయత్నం కొనసాగినట్లు తెలుస్తున్నది. ఇక 2019 నుండి 21 మధ్య కాలంలో "ఐ ఆమ్ అండ్ ఐ విల్" ఆత్మస్థైర్యాన్ని పెంచడానికి ఈ నినాదం తోడ్పడగా ప్రస్తుతం 2022 నుండి 24 మధ్యకాలంలో ఇచ్చిన నినాదాన్ని గమనిస్తే "క్లోజ్ ది కేర్ గ్యాప్" అవాంతరాలను అడ్డుకుందాం అవగాహనను పెంచుకుందాం అవసరమైన అంశాలపై దృష్టిసారిద్దాం అనే అర్థంలో ప్రాధాన్యతలు ఇచ్చినట్లుగా తెలుస్తున్నది.

2008 ఫిబ్రవరి 4న యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ సంస్థచే ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం డిక్లేర్ చేయబడినప్పటికీ 2020 నాటికి క్యాన్సర్ వల్ల అనారోగ్యం మరణాల సంఖ్య గణనీయంగా తగ్గించాలని లక్ష్యాన్ని 2008 నాటి డిక్లరేషన్ ఆమోదించినట్లుగా తెలుస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా మరణాలకు మొదటి




ప్రధాన కారణం గుండెపోటు అయితే రెండవ ప్రధాన కారణం అంతేకాదు 70% క్యాన్సర్ మరణాలు అల్ప మధ్య ఆదాయ దేశాల్లోనే సంభవించడాన్నీ మనం గమనించవచ్చు. ప్రణాళిక ఆర్థిక వనరులను సకాలంలో సమీకరించుకోవడం ద్వారా నివారణ చర్యలను సమస్య తీవ్రతను ముందస్తుగా గుర్తించడంతోపాటు నిర్మూలనకు తగిన వ్యూహాలను అమలు చేయడం ద్వారా లక్షలాది మంది జీవితాలను రక్షించవచ్చునని ప్రధాన ఎజెండాతో చైతన్యాన్ని అవగాహనను ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం కోసం ఉద్దేశించబడిన ఈ అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం ఊరు వాడవాడలా కొనసాగినప్పుడు మాత్రమే



బాధితులు పీడుతులకు ఉపశమనం లభిస్తుంది. ఈ మేరకు ప్రపంచ దేశాల యొక్క శ్రద్ధ నిబద్ధతను నొక్కి చెప్పిన ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థ తక్షణమే కీలకమైన చర్యలను తీసుకోవడం ద్వారా మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించాలని చేసిన సూచన జరుగుతున్న అమలు మొత్తంలో మరణాలను సమర్థవంతంగా అదుపు చేస్తున్నట్లుగా తెలుస్తున్నది.

**క్యాన్సర్ అంటే ఏమిటి కొంత అవగాహన**

పూర్వకాలంలో సరైన చికిత్స లేని కారణంగా మరణాల సంఖ్య గణనీయంగా ఉండేది కానీ ఇటీవల కాలంలో శాస్త్రీయ పరిశోధనలు వేగవంతమైన సందర్భంగా పెద్ద మొత్తంలో అరికట్టడానికి అవకాశం లభించింది. అమెరికా ఇతర దేశాలలో జరుగుతున్న పరిశోధన ఫలాలను భారతదేశం లోపల కూడా అమలు చేస్తున్న సందర్భాలను మనం గమనించవచ్చు." శరీరంలో ఎక్కడ్కైనా ఆ సందర్భంగా అసాధారణంగా కణాల యొక్క అదుపు లేని పెరుగుదలను క్యాన్సర్ అనవచ్చునని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యాధి సోకే అవయవాలను బట్టి ఆ వ్యాధికి పేరు పెట్టడం జరుగుతున్నది ప్రపంచ వ్యాప్తంగాఈ వ్యాధి అత్యంత స్థాయిలో విస్తరించి ఉన్నట్లుగా తెలుస్తూ ఉంటే క్యాన్సర్ లక్షణాలను ఎలా గుర్తించాలో ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ప్రపంచవ్యాప్త ంగా ఈ ప్రాణాంతక వ్యాధి యొక్క విస్తరణ ఉధృతి గమనించి దానిపైన తగు రీతిలో పోరాడేందుకు ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థలను సిద్ధం చేయడం కూడా ఈ దినోత్సవం యొక్క లక్ష్యంగా గుర్తించాలి. అంతేకాదు అపోహలను తగ్గించడం, సరైన సమాచారాన్ని ఇవ్వడం, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం, నివారణ మార్గాలను తెలియజేయడం, సరైన పోషకాహారం సూచించడం జరుగుతున్నది .అందులో భాగంగా భారతదేశంలో క్యాన్సర్ నుండి ప్రజలను రక్షించడానికి జరుగుతున్న పలు రకాల ప్రచార కార్యక్రమాలలో భాగంగా ప్రతి సంవత్సరం




నవంబర్ 7 తేదీన దేశవ్యాప్తంగా క్యాన్సర్ అవగాహన దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలుస్తుంది.

**కొన్ని కారణాలను అన్వేషిస్తే**

శరీరంలోని జీవకణాలు అవసరాలకు అనుగుణంగా కొత్త కణాలను ఏర్పరుస్తాయి దెబ్బతిని చనిపోయినప్పుడు కొత్త కణాలు వాటి స్థానంలో తిరిగి ఏర్పడతాయి కానీ క్యాన్సర్లు అలా జరగదు. శరీరంలో క్యాన్సర్ అభివృద్ధి చెందినప్పుడు కణాలు అసాధారణంగా మారుతాయి అంతేకాదు పాత కణాలు చనిపోయే బదులు కొత్త కణాల అవసరం లేనప్పటికీ అవి కూడా అభివృద్ధి చెంది నియంత్రణ లేకుం డా కన విభజన జరుగుతూ అదుపు లేకుండా విభజించబడి కనితులుగా మారుతాయి అని వైద్య నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఇక కొన్ని లక్షణాలను సాధారణంగా చెప్పదలుచుకుంటే గొంతు మంట, తరచుగా దగ్గు రావడం, తినేటప్పుడు మింగడంలో ఇబ్బంది, శరీరంలో ఏ భాగము నుండ్కైనా నీరు లేదా రక్తం ప్రవహించడం , పుట్టుమచ్చల రంగు మారడం పెరుగుదల, శరీరంలో ఏర్పడిన గాయాలు చాలా కాలం పాటు మానకపోవడం, ఆకలి లేకపోవడం, కారణం లేకుండా బరువు తగ్గడం లేదా పెరగడం, అన్నివేళలా అలసట లేదా బద్ధకం ఏర్పడడం, ఇబ్బందితో కూడిన మూత్ర విసర్జన ప్రధానంగా ఈ లక్షణాలను గమనించవచ్చు. తీవ్రంగా పట్టిపీడిస్తున్న ఈ అనారోగ్యాన్ని నివారించడానికి అవగాహన అతి పెద్ద విషయమని అంతే స్థాయిలో ఆరోగ్యకరమైన జీవనశ్కైలి ,ఆహారం కూడా ముఖ్యమని వైద్య రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

తీవ్రమైన అనారోగ్యానికి తీసుకున్న మందుల కారణంగా కూడా ఈ క్యాన్సర్ రావచ్చు కానీ ఇతర కారణాలు కూడా ఉన్నాయని వైద్యులు సూచిస్తున్నారు. ధూమపానం, అధిక బరువు , పోషక విలువ లేని ఆహారం, పొగాకు నమలడం, శారీరక శ్రమ వ్యాయామం లేకపోవడం కూడా ప్రధాన కారణాలుగా భావించాలి. ముఖ్యంగా రోగ నిరోధక శక్తి తగ్గుదల కూడా ఇందుకు కారణం కావచ్చు.

**నివారణకు, అదుపు చేయడానికి సూచనలు:**

సంపూర్ణ ఆరోగ్యంతో పాటు క్యాన్సర్ నివారణకు క్షారతత్వ ఆహారం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. టమాట, బొప్పాయి, దబ్బ కాయ, నారింజ, బెర్రీస్, బ్రొకోలీ, కాలీఫ్ల వర్, క్యాబేజీ ,క్యారెట్ , దోసకాయ, సొరకాయ, బూడిద గుమ్మడి, నేతి బీర, కొబ్బరి, తులసి, మంచి పసుపు వంటి ఆహార పదార్థాలు క్షార గుణాన్ని పెంచుతాయని క్యాన్సర్ నివారణ ,నిర్మూలనలో తోడ్పడతాయని చెప్పవచ్చు. కొబ్బరి పాలు, నువ్వుల పాలు, వేరుశనగ పప్పు ఇతోధి కంగా దోహదపడతాయి. ముఖ్యంగా సిరి ధాన్యాల ఆహారం తోడ్పడుతుందని గత దశాబ్ద కాలంగా స్వతంత్ర ఆహార శాస్త్రవేత్త ఖాదరవలి గారు చేస్తున్న ప్రచారం ప్రబోధం ఆచరణలో ఎంతో మేలు చేసినట్లుగా అనుభవా ల ద్వారా తెలుస్తున్నది. ఇక సకాలంలో తగినంత నిద్రపో వడం, పోషక ఆహారం తీసుకోవడం, యోగా, ధ్యానం, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం, ప్రకృతి వైద్య విధానాల ను తరచుగా పాటించడం, మానసిక ప్రశాంతతను పెంపొం దించుకోవడం, ఆత్మస్థైర్యంతో సానుకూల దృక్పథంతో నూతన జీవనశ్కైలిని అలవర్చుకోవడం మందులు చికిత్సకు అదనంగా జోడిరచినట్లయితే మరణాల సంఖ్యను గణనీయ ంగా తగ్గించడంతోపాటు రోగ తీవ్రతను కూడా పెద్ద మొత్తంలో అరికట్టవచ్చు. ఆహార ఆరోగ్య నిపుణులు చేస్తున్న ఈ సూచన ఈ సందర్భంగా ఆకలింపు చేసుకోవడం ద్వారా రోగ తీవ్రతను అరికట్టే ప్రయత్నం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత. స్థానికంగా ఆలోచించడం అంతర్జాతీయ స్థాయిలో అవగాహన ద్వారా పరస్పరం విజ్ఞానాన్ని పంచుకోవడం ద్వారా అదుపు చేయడానికి మరింత ఆస్కారం ఉన్నది.

# ఇంకా లింక్ కానీ 11.48 కోట్ల పాన్ కార్డులు

- **ఆధార్ లింకింగ్ పెనాల్టీ కింద ఒక్కొక్కరి నుంచి వెయ్యి వసూల్**




**తరంగాలు/న్యూఢిల్లీ:** పాన్, ఆధార్ కార్డు లింకింగ్తో సుమారు 600 కోట్లు వసూల్ చేసినట్లు కేంద్రం వెల్లడించింది. ఇప్పటి వరకు ఇంకా 11.48 కోట్ల పాన్ కార్డులు లింక్ కాలేదన్నారు. కేంద్ర మంత్రి పంకజ్ చౌదరీ ఈ విషయాన్ని ఇవాళ పార్లమెంట్లో లిఖిత పూర్వక సమాధానం ద్వారా చెప్పారు. గత ఏడాది జూలై 1వ తేదీ నుంచి 2024 జనవరి 31వ తేదీ వరకు 601.97 కోట్లు వసూల్ అయినట్లు మంత్రి వెల్లడించారు. పాన్, ఆధార్ లింకింగ్ పెనాల్టీ కింద ఒక్కొక్కరి నుంచి వెయ్యి వసూల్ చేశారు. గత ఏడాది జూన్ 30వ తేదీ వరకు ఉచితంగా పాన్, ఆధార్ లింక్ చేశారు. ఇప్పటికి కూడా లేట్ ఫీజు వసూల్ చేస్తున్నారు. వెయ్యి చెల్లిస్తే పాన్, ఆధార్ను లింక్ చేస్తున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిపై నోరుపారేసుకున్న బాల్క సుమన్!



**తరంగాలు/మంచిర్యాల:** సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ ఫైర్ అయ్యారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా చెప్పు చూపించారు. కేసీఆర్ను లంగా అంటున్న రేవంత్ రెడ్డినే పెద్ద రండగాడు, హౌలే గాడని దూషించారు. రేవంత్ రెడ్డిని చెప్పుతో కొట్టినా తప్పులేదని.. సంస్కారం అడ్డొచ్చి ఆగుతున్నామన్నారు. సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి పదవిని బట్టి, స్థాయిని బట్టి బాల్క సుమన్ మాట్లాడాలన్నారు. రైతుబంధు డబ్బులు అడిగితే కాంగ్రెస్ మంత్రులు రైతులను చెప్పుతో కొడతామంటున్నారన్నారు. రైతు బంధు కోసం గత ప్రభుత్వం విడుదల చేసిన రూ.7,700 కోట్లను మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్‌కి, కాంగ్రెస్ కంట్రాక్టర్ల జేబుల్లోకి మళ్ళించారని బాల్క సుమన్ ఆరోపించారు.

# 'భరోసా' కేంద్రాన్ని సందర్శించిన పోలీస్ కమిషనర్



**తరంగాలు /ఖమ్మం జిల్లా బ్యూరో :** లైంగికదాడికి గురైన బాధితురాలు ఫిర్యాదు చేసినప్పటి నుంచి కేసు ట్రయల్ కు వచ్చే వరకూ, పరిహారం ఇప్పించేవరకూ "భరోసా సెంటర్" అండగా నిలుస్తుందని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో అవరణలో వున్న భరోసా సెంటర్ ను పోలీస్ కమిషనర్ సందర్శించారు. పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే కేసుల్లోని బాధిత మహిళలను అక్కున చేర్చుకుని వారికి వైద్యుడు, సైకాలజిస్టు, న్యాయాధికారి,పోలీసులు న్యాయ సహాయం చేయడం, ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించడం వంటి సేవలతో బాధితులకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో 'భరోసా' కేంద్రం పని చేస్తుందని అన్నారు. బాధితులు రాగానే ఎవరి పరిధిలో వారు పనిచేస్తూ సత్వర న్యాయానికి కృషి చేస్తారని పెర్కొన్నారు. వీటితో పాటు ఈ భరోసా సెంటర్లు బాధితులకు నైపుణ్యాలను నేర్పించి, వారిని సమాజంలో ఉన్నతంగా జీవించేలా దోహదపడుతుందన్నారు. అందుబాటులో వున్న లీగల్, మెడికల్, చిన్నారుల కౌన్సెలింగ్ గదులు, స్టేట్మెంట్ రికార్డు సమావేశ గదులను పరిశీలించిన పోలీస్ కమిషనర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీసీఆర్బీ ఏసీపీ గణేష్, సిఐ అంజలి, ఎస్సై స్రవంతిరెడ్డి,భరోసా టీమ్ పాల్గొన్నారు.

# అర్హులైన పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలి

- **తక్కలపెల్లి రవీందర్ రావు**



**తరంగాలు/నర్సంపేట:** వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లోని అర్హులైన పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ తక్కల పెల్లి రవీందర్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు త్వరలో ఉన్నందున నియోజకవర్గం పరిధిలోని పట్టభద్రుల ఓటర్లకు ఫిబ్రవరి 6 తారీకు చివరి తేదీ కావున అర్హులైన పట్టభద్రులు కావలసిన పత్రాలు డిగ్రీ, సర్టిఫికేట్, ఆధార్ కార్డు,ఓటర్ ఐడి కార్డు, పాస్ ఫోటోతో కలిపి ఫారం 18 ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసి గెజిటెడ్ అధికారులతో అటే స్టేషన్ చేయించి తాసిల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు అందజేయాలన్నారు. ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని ,నిరుద్యోగుల పక్షాన పని చేసే నిజాయితీ గల వ్యక్తిని ఎన్నుకోవాలని కాంగ్రెస్ పార్టీ నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ తక్కల పెల్లి రవీందర్ రావు పట్టభద్రుల ఓటర్ మహాశయులకు విజ్ఞప్తి చేశారు.

# ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తాం

- **గ్రివేన్స్ లో బాధితులకు భరోసా కల్పించిన పోలీస్ కమిషనర్**



**తరంగాలు /ఖమ్మం జిల్లా బ్యూరో : ఖమ్మం :** బాధితుల ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సమస్యను చట్టపరిధిలో పరిష్కారించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికా రులకు ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రివేన్స్ డే కార్యక్రమం పోలీస్ కమిషనర్ కార్యాల యంలో జరిగింది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీస్ కమిషనర్ సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. ఫిర్యాదులో అధికంగా భూ వివాదాలు, కుటుంబ , వ్యక్తిగత సమస్యల తో పాటు ఆర్థిక లావాదేవీలు, భార్యభర్తల సమస్యలపై వచ్చిన బాధితుల ఫిర్యాదులను పరిశీలించారు. ఫిర్యాదలపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ బాధితులకు భరోసా కల్పించారు.

## స్ట్రీట్ లైట్లు రిపేర్ చేయించిన 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్



**తరంగాలు/వరంగల్ జిల్లా ప్రతినిధి:** సోమవారం రోజు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ ఎన్ టీ ఆర్ నగర్ లో గ్రామ ప్రజలు స్ట్రీట్ లైట్లు రావడం లేదని నా దృష్టికి రావడంతో సంబంధిత ఎలక్ట్రిసిటీ అధికారులకు తెలియజేయగా వారు సత్వరమే స్పందించి సిబ్బందిని పంపించడంతో వారితో కలిసి దగ్గరుండి స్ట్రీట్ లైట్లు రిపేర్ చేయించిన మీ 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్. వారి వెంట ఎన్ టీ ఆర్ నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్.కే జావిద్, మహిళలు, ఎలక్ట్రిసిటీ సిబ్బందితోపాటు తదితరులు పాల్గొన్నారు...

## యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 279వ రోజు అన్నదాన కార్యక్రమం



**తరంగాలు/వరంగల్ జిల్లా ప్రతినిధి:** యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాకు చెందిన కీ.శే బొల్లం కుమారస్వామి జ్ఞాపకార్థంగా భార్య బొల్లం హేమలత , కుమారుడు - కోడలు బొల్లం అభినవ్ - రమ్య కూతురు - అల్లుడు లింగం మేఘన - కిరణ్ కుటుంబ సభ్యుల సహకారంతో స్వయంకృషి మహిళా సొసైటీ వృద్ధాశ్రమం ములుగు రోడ్ , హనుమకొండ లో ఉన్న వృద్ధులకు 279వ రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బొల్లం హేమలత , కుమారుడు బొల్లం అభినవ్ - రమ్య , కూతురు - అల్లుడు లింగం మేఘన - కిరణ్ , మనవాళ్లు - మనవరాలు బొల్లం వైష్ణవి , బొలం నవీన్ రాజ్ , లింగం షైనీ , లింగం కుమారస్వామి , చంద్రకళ , మాడిశెట్టి రాకేష్ యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ) , కానిస్టేబుల్ బొట్టు కమలాకర్ , కోలా రాజేష్ , ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ , అలువల పృథ్వీ , ఉప్పరపల్లి రాజ్ కుమార్ , మునిగాల రాంప్రసాద్ , సృజన , జ్యోతి , భావన , బిటుకూరి యాకయ్య , పాలకుర్తి విష్ణు , ఎస్.కె ముస్తఫా , లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ ( హైకోర్ట్ అడ్వకేట్ ) , ఊరటి రవికుమార్ , యాద రవి కుమార్ , చెలిమల్ల అశోక్ కుమార్ , తూనం రాము , సి.ఐ.ఎస్.ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్ , మోడెం రాజశేఖర్ గౌడ్ , నాగవెల్లి కార్తిక్ లు పాల్గొనడం జరిగింది.

## ఆకలి తీర్చిన దానధర్మ ట్రస్ట్ చైర్మన్ గంటా రాదా





**తరంగాలు/పినపాక:** దానధర్మా ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు, భోజనాల ఏర్పాటు చేసినట్లు చైర్మన్ గంట రాధా తెలిపారు. సోమవారం మణుగూరు మండలం తిర్లపురం పంచాయతీ పరిధిలోని వలస ఆదివాసి గ్రామమైన పెద్దపెల్లిలో సుమారు 200 మంది పిల్లలకు మరియు వృద్ధులకు భోజనం వసతి, మహిళలకు చీరలు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గంట రాధా మాట్లాడుతూ పెద్దపల్లి గ్రామంలో పిల్లలు మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని అన్నారు. వారందరికీ టెస్టులు నిర్వహించి మందులు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దుస్తులు భోజన కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన ట్రస్ట్ సభ్యులకు మరియు దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## భూపాలపల్లి మున్సిపల్ ఎక్స్-అఫిషియో మెంబర్‌గా మ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**తరంగాలు ప్రతినిధి/భూపాలపల్లి:** భూపాలపల్లి మున్సిపల్ ఎక్స్ - అఫిషియో మెంబర్‌గా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం మున్సిపల్ కమిషనర్, పలువురు కౌన్సిలర్ల సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. మున్సిపల్ యాక్ట్ - 2019 ప్రకారం కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు మున్సిపల్ ఎక్స్ - అఫిషియో మెంబర్‌గా కొనసాగుతారు. భూపాలపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ అనిల్, అధికారులు, పలువురు కౌన్సిలర్ల సమక్షంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం పలువురు ఎమ్మెల్యే కి పూలబొకే ఇచ్చి, శాలువాలు కప్పి ఘన సన్మానం చేసి, అభినందనలు తెలిపారు.

## అశోక్ నగర్- బెల్ట్ షాప్‌లో

# దొరికిన కాడికి దోచుకోవటమే

- రాత్రి 11 గంటలకు కూడా అమ్ముకుంటున్నారు
- అయినా స్పందించని అధికారులు
- పెడదోవ పడుతున్న యువత
- తాగి తాగి ఆరోగ్యాలు గుల్ల
- ఒక్కో ఊర్లో 10కిపైగా దుకాణాలు
- ప్రతి బాటిల్‌పై రూ.20 నుంచి 40 అదనపు బాదుడు
- రోజుకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు అమ్మకాలు
- మద్యం దుకాణదారుల అండతో దందా
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



**తరంగాలు/ఖానాపురం:** మండల పరిధిలో అశోక్‌నగర్‌లోని మరియు మండలంలోని 20 గ్రామాలు ఉండగా 18 గ్రామాల్లో అక్రమంగా బెల్టుషాపులు నడుస్తున్నాయి. గల్లి కి ఒకటి చొప్పున మండలంలో సుమారు 100కి పైగానే బెల్ట్ షాప్ లు ఉన్నాయి. బెల్ట్ షాపుల్లో ప్రతి బాటిల్ పై అదనంగా 20 రూపాయల నుండి 40 రూపాయల వరకూ విక్రయాలు జరుపుతున్నారు. గ్రామంలో గల కిరణాలు అడ్డాగా మారి 24 గంటలు మద్యం అందుబాటులో ఉండడంతో యువత మద్యానికి బానిస గా మారుతున్నారు.



బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతున్న వారిపై దాడులు జరుపుతున్న పోలీసులు కళ్ళ ముందు నడుస్తున్నా బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. మద్యం షాపుల యజమానులు కొంతమంది అధికారులకు మామూలు ముట్టజెప్పి బెల్టు షాపులను కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఎవరైనా బెల్టుషాపులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే నామ్కేవస్తిగా వెళ్లి తనిఖీలు చేపట్టి కొంత మద్యం సీజ్ చేయడమే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. తద్వారా వారి వద్ద ఉన్న కాడికి దోచుకుంటున్న ట్లు సమాచారం నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా బెల్టు షాపులను ఏర్పాటు చేసుకొని విచ్చలవిడిగా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. అక్రమంగా మద్యం విక్రయించే వారిపై కేసులు నమోదు చేసే అధికారం ఎక్సైజ్ పోలీసు శాఖకు ఉంది. బెల్టుషాపుల లో మాత్రం యథేచ్ఛగా మద్యం అమ్ముతున్నారు. మామూళ్ల మత్తులో సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో బెల్టుషాపులకు కాసుల వర్షం కురిపిస్తుంది. 24 గంటలు మద్యం అందుబాటులో ఉండడంతో యువత పెడదారి పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి వాటిని మూసివేసి కుటుంబాలను కాపాడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- స్మశాన వాటిక తో పాటు సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి...





**తరంగాలు/హన్మకొండ జిల్లా ప్రతినిధి:** హన్మకొండ 58 డివిజన్ వడ్డేపల్లి 100 ఫీట్ రోడ్ లో కోటి రూపాయల నిధులతో కాపు స్మశాన వాటిక తో పాటు సిసి రోడ్డు నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా 15 సంవత్సరాల నుండి వడ్డేపల్లి గ్రామం లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని అన్నారు. వడ్డేపల్లి వాసులకు జనరల్ స్మశాన వాటిక లేక ప్రజలు పడుతున్న అవస్థలు చూసి వడ్డేపల్లి చెరువు మత్తడికి దగ్గరలోనే స్మశాన వాటిక స్థల పరిశీలన చేయాలని అధికారులను కోరారు. సోమవారం ఆ స్మశాన వాటికకు నిధులు కేటాయించి నిర్మాణ పనులకోసం శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు. ఇటీవల మొన్నటి వర్షాలకు కొట్టుకు వచ్చిన దేక్కాకు వడ్డేపల్లి గోపాల్ పూర్ చెరువు, బంధం చెరువులో పాతుకు పోవడం వలన మత్స్య కారులు చాల ఇబ్బందులు పడుతున్నారని వారు ఎమ్మెల్యే కు వినతి పత్రం సమర్పించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి వాటిని తొలగించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏ. నాగరాజు, డివిజన్ అద్యక్షుడు తాళ్ళపల్లి సుధాకర్, 60 డివిజన్ అద్యక్షుడు అనుకోటి పున్నం, తాళ్ళపల్లి రవీందర్, తాళ్ళపల్లి మేరీ, మిట్టపల్లి శంకర్, రవీందర్, మున్సిపల్ అధికారులు కాంట్రాక్టర్ల వడ్డేపల్లి గ్రామా ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధి కల్పనలో స్థానికులకు మొండిచేయి

- స్థానికేతర్లకు పెద్దపీట వేస్తున్న సింగరేణి ఓ బి యాజమాన్యాలు...
- సింగరేణి అధికారుల ఆదేశాలను సైతం లెక్క చేయని ఓబి కంపెనీల యాజమాన్యాలు...




**తరంగాలు/పినపాక:** సింగరేణి ఓబి యాజమాన్యాలు ఉపాధి కల్పనలో స్థానికులకు మొండిచేయి చూపిస్తూ స్థానికేతర్లకు పెద్దపీట వేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకరు..ఇద్దరికైనా ఉపాధి కల్పించమని ఏరియా అధికారులు ఆదేశాలు జారీ చేసినా సింగరేణి ఓ బి యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని,స్థానికులకు 80 శాతం ఉపాధి కల్పించాల్సిందేనని స్వయానా నాటి డైరెక్టర్ పా నేటి సింగరేణి ఎండి బలరాం ఆదేశాలను సైతం పక్కన పెట్టారంటే సింగరేణిలో ఓబీ కంపెనీలు ఎంతటి ప్రభావాన్ని చూపిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు అన్నారు. వివరాల్లోకి వెళితే మణుగూరు సింగరేణి ప్రైవేట్ ఓబీ కంపెనీలలో పని చేయడానికి స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని ఈ ప్రాంత టీం లీడర్ అయిన సింగరేణి ఏరియా జి ఎం స్వయానా సంతకం చేసి పనికి తీసుకోమని చెప్పినప్పటికీ, క్రింది స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదు. సింగరేణి భూ నిర్వాసిత నిరుద్యోగి చేసుకున్న దరఖాస్తు పైన సింగరేణి జిఎం సంతకం చేసి పంపినా కూడా ఆ సంతకానికి విలువ లేకుండా ప్రైవేట్ కంపెనీ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ స్థానిక నిరుద్యోగుల ఉసురు పోసుకుంటున్నారు. స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించకుండా,దొడ్డిదారిలో స్థానికేతర్లను పనిలో పెట్టుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సింగరేణి ఏరియా హాస్పిటల్ లో, ఎంపీటీసీ శిక్షణకై ఓబి కంపెనీలు ప్రతిరోజు పంపిస్తున్న మెడికల్, మైన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ శిక్షణకు వంద మందిలో ఒకరు ఇద్దరు స్థానికులు అది కూడా పెద్దపెద్ద నాయకులు, అధికారులు సిఫారసు చేస్తే మాత్రమే, ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతున్న వైనం మహాలక్ష్మి, దుర్గా ఓ బి కంపెనీల చెక్ పోస్ట్ దగ్గర వాచ్ మెన్ లు నిరుద్యోగులను చివరికి కార్మిక సంఘాల నాయకులను కూడా సైట్ ఆఫీస్ లోపలికి రానివ్వకుండా అడ్డుకుంటున్న వైనం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అసలు కంపెనీకి సంబంధించిన మేనేజర్ గాని, ఏజెంట్ గాని ఎప్పుడు కూడా కలిసే పరిస్థితి లేదు. ఏజెంటు పెట్టిన సంతకానికి కూడా విలువ లేకుండా రెండు నెలల నుంచి నిర్వాసితుడ్ని సింగరేణి అధికారులు తిప్పుతున్నారు, ఇంత దౌర్భాగ్య స్థితిలో ప్రైవేటు కంపెనీలు ఉన్నాయి, కార్మిక సంఘాల నాయకులు చెప్పినాగాని నిర్లక్ష్యం చేస్తున్న అహంకార ధోరణిలో ప్రైవేట్ కంపెనీ యాజమాన్యం ఏకచత్రాధిపత్యాన్ని ప్రదర్శిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. సింగరేణి బొగ్గు గనుల ఏర్పాటుపై సర్వం కోల్పోయి అన్నమో రామచంద్రా అంటూ దీనంగా సింగరేణి వైపు చూస్తున్న స్థానికులు నిర్వాసితుల ఉపాధి కల్పన విషయమై “సింగరేణి సామాజిక బాధ్యత”లో భాగంగా చర్యలు చేపట్టాలనీ స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరసనలు వెల్లువెత్తుతున్నాయి, ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించాలని స్థానికులకు 80శాతం ఉపాధి అవకాశాలు కల్పించేలా ఎండి బలరాం ఆదేశాలు అమలు చేయాలని అమలు చేయని స్థానిక యాజమాన్యాల పై, కాంట్రాక్టర్లపై స్థానిక యాజమాన్యం చర్యలు తీసుకోవాలి ఆకలితో అలమట్టిస్తున్న నిరుద్యోగులు కోరుతున్నారు.

## ఆర్టీఐ వికాస సమితి అధ్యక్షులుగా బోడ లక్ష్మణ్ రావ్



**పినపాక-తరంగాలు**

తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు వికాస సమితి (రి.1251/2016) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఎరమాద కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పినపాక మండల అధ్యక్షులుగా బోద లక్ష్మణ్ రావ్ ను నియమించినట్లు, జిల్లా అధ్యక్షుడు శివప్రశాంత్ తెలిపారు. ఈ సందర్బంగా లక్ష్మణ్ రావ్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ఆశయాలను ఆదర్శాలను మండల వ్యాప్తంగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. సమాజంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను వెలికి తీసేందుకు సమాచార హక్కు చట్టం ఒక వజ్రాయుధమని అన్నారు. సహవిస మండల అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర, జిల్లా అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు.

## యూత్ ఫర్ యాంటీ కరప్షన్ క్యాలెండర్ ఆవిష్కరించిన పరకాల ఏసీపీ కిశోర్ కుమార్



**తరంగాలు-పరకాల**

యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ 2024 సంవత్సరం నూతన క్యాలెండర్ ను పరకాల ఏసీపీ ఇ. కిషోర్ కుమార్ సోమవారం తన కార్యాలయంలో యాక్ రీజనల్ అధ్యక్షుడు సూర. రాజేందర్ మరియు యాక్ సభ్యులతో కలిసి క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సమాజంలోని అన్ని రంగాలలో పేరుకుపోయిన అవినీతి భూతాన్ని అంతం చేయడంలో అవిశ్రాంత పోరాటం చేస్తున్న యాక్ టీమ్ ను అభినందిస్తూ ముఖ్యంగా విద్యార్థులలో అవినీతి రహిత సమాజం కోసం అవగాహనా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని అన్నారు. ప్రతీ ఒక్కరు ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించే విధముగా యాక్ కృషి చేయాలని ఈ సందర్భంగా సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ వరంగల్ రీజనల్ అధ్యక్షుడు సూర. రాజేందర్, పరకాల మండల ఉపాధ్యక్షుడు బాసాని. సుమన్, నడికూడ మండల అధ్యక్షుడు. చేపూరి. నాగరాజు, యాక్ జిల్లా కమిటీ సభ్యులు పావుశెట్టి. తరుణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


## మార్కెట్ చైర్మన్ పదవిని మాకు కేటాయించండి



**తరంగాలు-కేసముద్రం**

కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవినీ మాకు కేటాయించండని మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్ ను కలిసిన టీడీపీ నేతలు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఎమ్మెల్యే ఎన్నికల్లో మీ గెలుపుకోసం పూర్తి స్థాయిలో టీడీపీ పార్టీ అధ్వర్యంలో కృషి చేశామని. కేసముద్రం మార్కెట్ చైర్మెన్ పదవినీ టీడీపీ నాయకులకు కేటాయించాలని కోరుతూ సోమవారం మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య అధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ ను కలిసినట్లు కేసముద్రం మండల టీడీపీ అధ్యక్షులు ఎశబోయిన ఎల్లయ్య తెలిపారు. కేసముద్రం మార్కెట్ చైర్మెన్ పదవి ఇవ్వని పక్షంలో కేసముద్రం మార్కెట్ వైస్ చైర్మన్ పదవీ అయిన ఇవ్వాలనీ కోరినట్లు ఎల్లయ్య పేర్కొన్నారు. ఇందుకు ఎమ్మెల్యే మురళీ నాయక్ సానుకూలంగా స్పందించారని ఎల్లయ్య తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉన్నారు.

## వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



**తరంగాలు-కేసముద్రం**

సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిని వారి స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపిన బెరువాడ మాజీ సర్పంచ్ ముదిగిరి సాంబయ్య మండల కాంగ్రెస్ పార్టీ సహాయ కార్యదర్శి కాముని కుమారస్వామి సింగిల్ విండో డైరెక్టర్ గుగులోతు లోక్యా మాజీ ఎంపీటీసీ ముదిగిరి కుమారస్వామి మాజీ వార్డు సభ్యులు గుగులోతు చిన్న బిచ్చు కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోనగిరి వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

### 51,116 రూపాయలు అందజేసిన రఘువీర్-ఉమారాణి దంపతులు

**తరంగాలు-పర్వతగిరి**



పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామంలో రంగనాయకుల స్వామి గుట్ట ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణం కొరకు కరిమిళ్ళ సావిత్రి-చంద్రయ్య కుమారుడు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ వరంగల్ గోపాలమిత్ర సూపర్వైజర్ రఘువీర్-ఉమారాణి దంపతులు తమ వంతు సహాయంగా యాబై ఒక వెయ్యి నూట పదహారు రూపాయల నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు రాజు యాదవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం నా బాధ్యత

**•రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**తరంగాలు-ఖమ్మంజిల్లాబ్యూరో**




గ్రామాలలో పేద ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తున్న గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం తన బాధ్యతని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాలులో తెలంగాణ మైనార్టీ గ్రామీణ వైద్యుల సంఘం పదవ మహాసభ సంఘం జిల్లా అధ్యక్షుడు హసన్ అధ్యక్షతన జరిగింది. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి తుమ్మల ప్రసంగిస్తూ గ్రామాలలో మంచి పేరు సంపాదించుకుంటున్న మైనార్టీ గ్రామీణ వైద్యులు తన గెలుపుకూ చేసిన సహాయ ,సహకారాలు మరువలేనివి అన్నారు. ఖమ్మం జిల్లా తెలంగాణ మైనార్టీ గ్రామీణ వైద్యుల సంఘం డిమాండ్లు మొత్తం తెలంగాణ వ్యాప్తంగా ఉన్న గ్రామీణ వైద్యుల సమస్యలకు అద్దం పడుతున్నాయన్నారు. వృత్తికి సంబంధించిన సమస్యలు ,గ్రామీణ వైద్యుల కార్యాలయాలకు స్థలాలు అంశంపై దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తు అవసరాలకు సంఘాలకు సంఘ భవనాల అవసరం ఉంటుందని, ఒక రోజు ముందు హైదరాబాదుకు వస్తే సమస్యలు కొన్ని ఇతర మంత్రులకు చెందినవని, వాటిని అయా మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి ప్రయత్నిస్తానన్నారు. తన పర్యటనలో మహాసభ కార్యక్రమం లేదని ,వెళుతూ మార్గమధ్యలో సభకు వచ్చానన్నారు. తన గెలుపులో భాగస్వాములైన మైనార్టీ గ్రామీణ వైద్యుల కు ఈ సందర్భంగా తన కృతజ్ఞతలు తెలిపారు. తొలుత ఆయన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ . హసన్ మాట్లాడుతూ తమ సంఘం ప్రధానంగా గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి పాటుపడుతుందని, ఇదే సమయంలో సంఘం బలోపేతం మే లక్ష్యంగా కార్యాచరణ పెట్టుకుంటామన్నారు. అన్నివేళలా గ్రామీణ వైద్యులకు అండదండలుగా ఉంటామని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. జానీ మియా మాట్లాడుతూ తమ ఆర్ఎంపీల డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అమలు చేయాలని కోరారు.మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్ హసన్ ( నేరడ) , సంఘం వ్యవస్థాపకులు షేక్ . నజిరుద్దీన్ , జిల్లా కోశాధికారి షేక్. బాబు సాహెబ్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్. ఖాసిం , షేక్. చాంద్ పాషా , జిల్లా జాయింట్ సెక్రటరీ షేక్ . అషా, ప్రచార కార్యదర్శులు షేక్. అమీర్ , షేక్ జానీ (శిరాంగిరి), కార్యదర్శులు షేక్. అబ్జల్ ,షేక్ .మస్తాన్ పా షా, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు షేక్ అహ్మద్ పాష , షేక్. వలి , షేక్ .షాజహాన్ , షేక్. నబి , షేక్. మన్సూర్ అలీ, మహిముద్ , షేక్ . బాజీ , షేక్. రబ్బాని , షేక్. నబీ , ఈశాక్ , షాక్ పాషా , డివిజన్ అధ్యక్షుడు షేక్. జానీమియా , షేక్. రంజాన్ పా షా,షేక్. మౌలానా ,షేక్. అఖిల్ అహ్మద్ , షేక్ . పా షా , షేక్. అజిముద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలి

**•జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య**

**తరంగాలు ప్రతినిధి-వరంగల్**



జిల్లాలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు జవాబుదారీతనంతో పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పేర్కొన్నారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారులకు పంచాయతీ పాలనపై జరిగిన శిక్షణా కార్యక్రమనికి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడేతో కలసి హాజరై సమర్ధవంతంగా విధుల నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ప్రత్యేక అధికారికి మూడు గ్రామపంచాయతీలు పరిశీలించే బాధ్యత ఉందని, ప్రతిరోజు ఒక గ్రామ పంచాయతీ పరిశీలన చేస్తూ రోజూ చేయవలసిన కార్యక్రమాలపై ప్రణాళిక బద్ధకం వ్యవహరించాలన్నారు. గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులను సిబ్బందితో సమన్వయం చేసుకొని పనిచేయాలని తెలిపారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా 'మిషన్ భగీరథ'తో తాగునీటి సరఫరా చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగునీరు, పారిశుధ్యం, నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణ, డంపింగ్ యార్డు నిర్వహణ, వైకుంఠ ధామాల అభివృద్ధిపై సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. రాబోవు వేసవిని దృష్టిలో పెట్టుకుని నర్సరీలలో మొక్కలకు నీటి సౌకర్యం, పంచాయతీ ట్రాక్టర్స్ వాటర్ ట్యాంకర్ లని చేసేలా చూడాలన్నారు. 7 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం సర్కులర్ రిలీజ్ చేసిందని ప్రతిరోజు చేపట్టిపోయే కార్యక్రమాలపై ప్రత్యేక అధికారులకు వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేయడం జరిగిందని ప్రతిరోజు చేసే కార్యక్రమాలను గ్రూప్ లో పోస్ట్ చేయాలన్నారు. ప్రత్యేక అధికారుల పాలన సమర్థవంతంగా నిర్వహించి ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కల్పన, డిఆర్డిఏ పిడి సంపత్ రావు, మిషన్ భగీరథ ఎస్సి రాములు, సంబంధిత ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల సమీకరణ పెంచాలి



**•జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**తరంగాలు ప్రతినిధి-వరంగల్**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల సమీకరణ పెంచాలని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ఎన్ఆర్ఈజీఎస్ కార్యకలాపాలపై ఆదనవు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖేడే తో కలసి డిఆర్డిఓ ఆధ్వర్యంలో జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డిపిఓ కల్పన, డిఆర్డిఓ పిడి సంపత్ రావు సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని క్షేత్రస్థాయిలో పగడ్బందీగా అమలు చేయడానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని చెప్పారు. మండలాల వారీగా ఎన్ఆర్ఈజీఎస్ కార్యకలాపాలపై రివ్యూ నిర్వహించి లేబర్ మొగలైజేషన్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులను చేయుటకు డిఆర్డిఓ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎన్ఆర్ఈజీఎస్ కార్యకలాపాలపై లోటుపాట్లను సరిదిద్దుకొని వచ్చే సమావేశానికి అన్ని అంశాలపై పురోగతి కనపడాలని, స్వచ్ఛ భారత్ మిషన్ లో భాగంగా వ్యక్తిగత మరుగుదొడ్లు, అలాగే ఏజెన్సీ ద్వారా, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిర్మించుకున్న వారి వివరాలను యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. నర్సరీ కార్యకలాపాలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ జీ ఎస్ పారామీటర్లు 100 రోజులు పూర్తి చేయాలన్నారు. వచ్చే వారంలోపు ఎన్ఆర్ఈజీఎస్ కార్యకలాపాల్లో పురోగతి కనపడని అధికారులు సిబ్బందిపై తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్, ఏపీవోలు, ఈసీలు, ఎంపీడీవోలు, ఎంపీలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్యాడ్స్, గ్రాఫ్ పుస్తకాలు వితరణ




**పినపాక-తరంగాలు**

ఏజిహెచ్ఎస్ ఎల్సిరెడ్డిపల్లి ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు 100 మందికి దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ తరఫున ప్యాడ్స్, కంపాస్ బాక్సులు గ్రాఫ్ పుస్తకాలను వితరణగా అందచేసిన ఎస్కేటి గ్రూప్స్ నిర్వాహకులు దోసపాటి నాగేశ్వరరావు కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ హెచ్ఎం పద్మ మరియు ఉపాధ్యాయులు, వాసవి క్లబ్ సభ్యులు నరసింహారావు రమేష్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**తరంగాలు-వరంగల్ జిల్లా ప్రతినిధి**



:గ్రేటర్ వరంగల్ కడిపికొండ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సాదినేని సుధాకర్ తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బి అర్ ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు, వర్ధన్నపేట మాజి ఎమ్మెల్యే అరూరి రమేష్ ఎంజీఎం మార్చురీ బ్లాక్ కి వెళ్లి వారి పార్థివ దేహాన్ని సందర్శించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వీరి వెంట కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర రావు,స్థానిక నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# ఇచ్చిన హామీలు అమలు చేసి ఓటు అడగాలి

**•స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**తరంగాలు-ప్రతినిధి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట మీద నిలబడేవాడైతే 100 రోజుల్లో ఇచ్చిన హామీలు అమలు చేసి ఓటు అడగాలని మాజీ ఉపముఖ్యమంత్రి,స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం ఆలేరు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఫంక్షన్ హాల్లో ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు .మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మాజీ ఉపముఖ్యమంత్రి,స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ... ఓటమి పాలైనా కృంగి పోవాల్సిన అవసరం లేదు,గెలుపోటములు సహజమన్నారు. తెలంగాణ ప్రభుత్వం కేసీఆర్ చేసిన పనులు కళ్ళముందే కనపడుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ పెట్టిన హామీలు వీలు కానీ హామీలని, ఆరు గ్యారెంటీ పథకాలు అన్నారు,కానీ అవి 420 పథకాల హామీలన్నారు. ముఖ్యమంత్రి అయినాక తొలి సంతకం రైతులకు 2 లక్షల రుణమాఫీ చేస్తామని, రైతుబరోసా కింద 15000 రూపాయల రైతు బంధు ఇస్తామన్న హామీ ఇంకా అమలు కాలేదన్నారు. పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కేంద్రం ఎంత ఒత్తిడి చేసినా మన ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించ లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాకముందే ప్రాజెక్టులను అప్పగించి సంతకం పెట్టింది. రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టింది.రేవంత్‌కు ఆలోచన లేక, అర్థం కాక ఆగమాగమై చిల్లర మాటలు మాట్లాడుతున్నారు. రాష్ట్రానికి నీటి సమస్యలను తీసుకొస్తున్నాడన్నారు. ప్రాజెక్టులకు బోర్డుకు అప్పగిస్తే ఖమ్మం, నల్లగొండ, మహబూబ్ నగర్‌లకు సాగు నీరు, తాగునీటికి సమస్య వస్తుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎలా మాట్లాడుతున్నారో ఇప్పుడూ అలాగే మాట్లాడుతున్నాడని అన్నారు. భువనగిరి ఎంపీ స్థానాన్ని మనం తప్పకుండా గెలవాలి. ఢిల్లీలో తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడాలంటే ఎంపీ ఎన్నికల్లో విజయం సాధించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం పోరాడేది ఒక్క బి ఆర్ ఎస్ పార్టీ మాత్రమేనని చెప్పారు.ఎంపీ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటాలి. పట్టుదలతో పనిచేయాలన్నారు. అనంతరం ప్రమాద వశాత్తు మరణించిన కార్యకర్తల కుటుంబాలకు 2 లక్షల ప్రమాద భీమా చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ,నల్గొండ జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మహేందర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య , ప్రజాప్రతినిధులు,బి ఆర్ ఎస్



# అర్హులైన ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలి

**•పట్టభద్రుల హక్కు - ఎమ్మెల్సీ ఓటు**

**•పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి**

**•ఊకల్ గ్రామపార్టీయూత్‌అధ్యక్షుడు పల్లె దేవేందర్ గౌడ్**

**తరంగాలు న్యూస్ -తొర్రూర్**



పాలకుర్తి నియోజకవర్గం రాయపర్తి మండలం ఊకల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు పల్లె దేవేందర్ మాట్లాడుతూ.. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అర్హులైన ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. విద్యావంతులు తలుచుకుంటే రాష్ట్ర రాజకీయాల తలరాతలే మారుతాయని జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిరూపించడం జరిగింది పట్టభద్రులారా మీరు మౌనంగా ఉంటే అవినీతి రాజ్యమేలే అవకాశం ఉన్నది కావున తప్పకుండా ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్న కాంగ్రెస్ పార్టీకి సీఎం అనుముల రేవంత్ రెడ్డి కి అండగా ఉండాలని ఒక మంచి వ్యక్తిని ఎమ్మెల్సీగా ఎన్నుకొని శాసన మండలికి పంపాలని కోరారు. అలాగే రేపటితో ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు ప్రక్రియ ముగుస్తుందని,ఇప్పటివరకు చేసుకోని గ్రాడ్యుయేట్లు ఆన్ లైన్‌లో,గాని ఆఫ్ లైన్ లో గాని నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

# దువ్వ యాదగిరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నేతలు

**తరంగాలు-హన్మకొండ ప్రతినిధి**



మాజీ డివిజన్ ప్రెసిడెంట్, మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ నాయకులు దువ్వ యాదగిరి జన్మదిన వేడుకలు, యువ నాయకులు దువ్వ వీర వెంకట రాజులు ఆధ్వర్యంలో జరిగాయి. ముందుగా కాంగ్రెస్ విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకొని పోచమ్మ దేవాలయంలో దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గొర్రెపోతుతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ యువ నేత విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో 47 డివిజన్ లో నిపుర ప్రముఖులు,నాయకులు, అభిమానులు పాల్గొని యాదగిరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అతిథులకు భోజన విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా నాయకురాలు దువ్వ రేవతి, మహిళా నాయకురాల్లు, నేతలు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓరుగల్లు ముఖచిత్రంపై చెదరని సంతకం ప్రణయన్నది

**• మీ అందరి ఆశీస్సులతో త్వరలో నా రాజకీయ నిర్ణయం వెల్లడిస్తా**

**• అండగా ఉండి ఆశీర్వదించండి ఆత్మీయ సమ్మేళనంలో వెల్లడించిన దాస్యం అభినవ్ భాస్కర్**

**తరంగాలు-హన్మకొండ జిల్లా ప్రతినిధి**

ప్రణయన్న ఆత్మీయుల సమ్మేళనంలో ఆయనతో తమకున్న బంధాన్ని గుర్తు చేసుకుంటూ ఉద్వేగానికి గురైన ఆత్మీయులు ట్యాంక్ బండ్ పై,హనుమకొండ గడ్డపై ప్రణయన్న విగ్రహం,జె.ఎన్ స్టేడియానికి ప్రణయ్ భాస్కర్ పేరు పెట్టాలని సమ్మేళనంలో పలువురి డిమాండ్. అందరు పుడతారు మరణిస్తారు. కానీ కొందరే మరణించి జీవిస్తారు.ఆ కోవకు చెందినవారే స్వర్గీయ దాస్యం ప్రణయ్ భాస్కర్ అని శారద గార్డెన్ లో జరిగిన ప్రణయన్న ఆత్మీయ సమ్మేళనంలో పలువురు వక్తలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనాడు స్వర్గీయ దాస్యం ప్రణయ్ భాస్కర్ ప్రాతినిధ్యం వహించిన హనుమకొండ నియోజకవర్గం పరిధిలోని కొండ పర్తి, సోమిడి, కాజీపేట,వడ్డేపల్లి, హనుమ కొండ, కుమార్ పల్లి, పెద్దమ్మగడ్డ,పెగడపల్లి, పైడిపల్లి, హసన్ పర్తి,మునిపల్లి గ్రామాల నుండి ప్రణయన్న ఆత్మీయులు, కళాశాల స్నేహితులు హజరైనారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ప్రణయన్న ఆత్మీయులు మాట్లాడుతూ..తమతో ప్రణయన్నకు ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు.తన అకాల మరణం మా కుటుంబాల్లో చీకటిని నింపిందన్నారు. తమ ప్రాణాలను పోలీసుల ఎన్కౌంటర్ల నుండి కాపాడిన దేవుడు ప్రణయన్న అని కొలిచారు. కులం,మతం,భాషా బేధాలు లేకుండా ప్రజలతో తన కుటుంబంలా మెదిలిన వ్యక్తి ప్రణయ్ భాస్కర్ అని కొనియాడారు.ఎంతో మందికి ఉద్యోగాలను, ఉపాధిని కల్పించిన మహనీయులు ప్రణయ్ భాస్కర్ అని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి దివిటీ



చుక్క,దేశ రాజకీయాల్లో ప్రదాని కొడుకును ఒడగొట్టి సంచలనం ప్రణయన్న అని వారు అన్నారు.ఆయనతో తమకున్న అనుబంధాన్ని పంచుకుని పలువురు బావోద్వేగానికీ లోనయ్యారు. మళ్లీ అట్లాంటి మహానాయకుడు రాడు, రాలేదని వారు అన్నారు. ఇన్నేండ్లు మా గుండెల్లో ఆయన స్థానం పదిలమని వారు తేల్చి చెప్పారు.. దాదాపు 27 ఏండ్ల తరువాత ప్రణయన్న ఆత్మీయులను ఒక్కచోటికీ చేర్చిన ఆయన ఆశయ సారథి దాస్యం అభినవ్ భాస్కర్ కు కృతజ్ఞతలు తెలిపారు. అభినవ్ భాస్కర్ రాజకీయ ప్రయాణంలో మేమెందరం తండ్రి స్థానంలో ఉండి ముందుకు నడుపుతామని వారు అన్నారు. అనంతరం ఆయన తనయుడు కార్పొరేటర్ డా.దాస్యం అభినవ్ భాస్కర్ మాట్లాడుతూ నాకు ఊహ తెలియని వయసులో నాన్న మాకు దూరమైతే,మీ మాటల్లోనే నేనిప్పటివరకు ఆయన్ను పోల్చుకున్నాను, ఆయన వ్యక్తిత్వాన్ని ఊహించుకున్నాను. కానీ ఇయ్యాల ఇంతమంది మా నాన్నతో కలిసి నడిసిన నా ఆప్తులందరినీ ఒకే వేదికపై కలుసుకోవడం నాకు ఊహించలేని సంతోషంగా ఉంది. ఆయన మరణాంతరం ఒక కుటుంబ దిక్కును కోల్పోయి నట్లు మీరందరు బిక్కుబిక్కుమని గడిపింద్రు కానీ ఇవాళ నా ఆత్మీయుల ముందు విషయాన్ని ప్రస్తావించాలని అనుకుంటున్నాను ప్రణయన్న



మరణాంతరం జరిగిన పరిణామాలు మీ అందరికీ తెలుసు.. మా అమ్మ అనాడు తన భవిష్యత్తును త్యాగం చేస్తే,ఇవాళ నా కుటుంబం కోసం నేను త్యాగం చేసి పోటీ నుండి తప్పుకున్నాను.. అయినప్పటికీ ఇప్పటి వరకు నేను కుటుంబానికి విలువనిచ్చి ఎన్నికల్లో ఆయన గెలుపుకు కష్టపడితే రాష్ట్రంలో ఎదురుదెబ్బ తగిలి బి ఆర్ ఎస్ పార్టీ ఓడిపోతే ఆ ఓటమికి నేను కారణమని ప్రచారం చేయడం ఒక విధంగా నన్ను ఎంతో కృంగదీసింది. ఎవరు ఆపాలనుకున్న ప్రణయన్న ఏకైక వారసుడిగా మీ ముందు నిలబడుతా ఇగ ఇట్లాంటి సమయంలో కూడా నన్ను నమ్ముకున్న,నా రాక కోసం ఎదురు చూస్తున్న నా వాళ్ళ కోసం నేనొక నిర్ణయం తీసుకోకపోతే ఈ రాజకీయ వ్యవస్థకు నేను సమర్థుడను కాను అని నేననుకుంటున్నా ఈ సమయంలో నాకు తండ్రి స్థానంలో ఉన్న మీ అందరినీ కలిసి మాట్లాడితే గుండె బరువు దిగుతదని నేను మిమ్మల్ని ఇలా కలుసుకుంటున్నాను...ఇకపై కలుసుకుంటూనే ఉంటాను.. నా నిర్ణయానికి మీ మద్దతు, ఆశీస్సులు అందుతాయని ఆశిస్తున్నాను. ఈ కార్యక్రమంలో ప్రణయన్న ఆత్మీయులు రాష్ట్ర మైనారిటీ కమిషన్ మెంబర్ దర్శన్ సింగ్, మాజీ కార్పోరేటర్ డిన్న, విరమల్ల భిక్షపతి,రావుల సుదర్శన్, సర్పంచులు, మాజీ సర్పంచులు,ప్రణయన్న మిత్రులు పాల్గొన్నారు.

## పాడే మోసిన ఖానాపురం ఎస్ఐ మాధవ్ గౌడ్



**తరంగాలు-వరంగల్ జిల్లా ప్రతినిధి:** భువనగిరి హాస్టల్లో మృతిచెందిన బుధరావుపేట గ్రామానికి చెందిన విద్యార్థినీ కోడి భవ్య అంతిమయాత్ర సోమవారం వారి స్వగ్రామంలో జరిగింది.ఈ సందర్భంగా భవ్య అంతిమ యాత్రలో ఖానాపురం ఎస్ఐ మాధవ్ గౌడ్ పాల్గొని పాడెను మోశారు.

# శ్రీరామ్ గ్రామైక్య సంఘాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

**• ఉత్తమ అవార్డు గ్రహీత మంజులకు ఘన సన్మానం**

**• డిఆర్డిఏ బ్యాంకు లింకేజీ జిల్లా అధికారి మర్రి దాస్**

**తరంగాలు ప్రతినిధి/వర్ధన్నపేట:**జిల్లాలోని గ్రామైక్య సంఘాల ప్రతినిధులు అందరూ పంతిని శ్రీరామ్, సాయిరాం వివో లను ఆదర్శంగా తీసుకొని మీ గ్రామైక్య సంఘాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుటకు కృషి చేయాలని డిఆర్డిఏ-సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (బ్యాంకు లింకేజీ విభాగం) డిపిఎం మర్రి దాస్ సూచించారు.సోమవారం ఐనవో లు మండలంలోని శ్రీ మల్లికార్జున మండల సమైక్య కార్యాలయంలో వివో ప్రతినిధులకు నిర్వహించిన నెలసరి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా మండలంలోని పంతిని శ్రీరామ్ వివో సహాయకురాలు ఉత్తమ అవార్డు గ్రహీత కోదాటి మంజులను జిల్లా అధికారులు, మండల సమైక్య ప్రతినిధులు. ఈసీ సభ్యులు కార్యాలయ సిబ్బంది శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డిపిఎం దాస్ మాట్లాడుతూ వివో ఏ మంజుల పేదరిక నిర్మూలనే ధ్యేయంగాపేదలకు నిత్యం అందుబాటులో ఉండి వారిని ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి పర్చి శ్రీరామ్ గ్రామైక్య సంఘాన్ని జిల్లాలో అన్ని విభాగాల్లో



నూ ప్రథమ స్థానంలో నిలుపుటకు కృషి చేశారని ఆమె సేవలను కొనియాడారు. మంజుల సేవలను గుర్తించిన జిల్లా అధికారులు 75వ రిపబ్లిక్ డే వేడుకల్లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ చేతుల మీదుగా ఉత్తమ వివోఏ గా ప్రశంస పత్రాన్ని అందజేశారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరు గ్రామైక్య సంఘాలను మరింత బలోపేతం చేసి ప్రభుత్వం అందిస్తున్న సేవలను అందించుటకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీఎం చీకటి రాజకుమార్, మండల సమైక్య అధ్యక్ష కార్యదర్శులు యమునా ,రేణుక, అనిత, లక్ష్మీ ,భవాని, సీసీలు ప్రశాంత్, శంకరయ్య, మోహన్ బాబు, ఎల్లయ్య, శ్రీనిధి మేనేజర్ రమేష్, ఎమ్మెస్ అసిస్టెంట్ స్వరూప, కంప్యూటర్ ఆపరేటర్ బిర్రు అనూష, మానస వివిధ గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు మదూరి జ్యోతి, రజిత ,సునీత, మంజుల, సుమలత ,నజీమా ,మాధవి, అనిత, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలు మారే చరిత్ర నాది కాదు...

- 2012 నుండి కేసీఆర్ నాయకత్వంలో క్రమశిక్షణ గల వ్యక్తిగా పార్టీ కోసం పని చేస్తున్న..
- రాజకీయంగా నన్ను ఎదుర్కోలేని కొంతమంది నా మీద అసత్య ప్రచారాలు చేస్తున్నారు..
- నేను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలను నమ్మొద్దు...
- పట్టభద్రులందరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకోవాలి...
- బిఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు,వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్....



**తరంగాలు ప్రతినిధి/వరంగల్:** పార్టీలు మారే చరిత్ర నాది కాదు అని ,2012 నుండి కేసీఆర్ నాయకత్వంలో క్రమశిక్షణ గల వ్యక్తిగా పార్టీ కోసం కష్టపడుతున్నానని, రాజకీయంగా నన్ను ఎదుర్కొలేని కొంత మంది నామీద అసత్య ప్రచారాలు చేస్తున్నారని,నేను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలు నమ్మొద్దు అని బిఅర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు,వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. సోమవారం హంటర్ రోడ్డు లో నిర్వహించిన మీడియా సమావేశంలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లడుతూ పదవులు శాశ్వతం కాదు గెలిచిన ఓడిన ప్రజల పక్షాన నియోజకవర్గ అభివృద్ధి కోసం,పార్టీ బలోపేతం కోసం కష్టపడతారని అన్నారు. సమాజాన్ని సమున్నతంగా నిర్మించేది ఉన్నత విద్యావంతులే..ఓటు హక్కు అనేది మన ఆయుధం మన తలరాతను మనమే మార్చుకోగలం అని అన్నారు. విద్యావంతులకు సమాజం పట్ల బాద్యత ఎక్కువగా ఉంటుంది.గతంలో జరిగిన ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సిగా బిఆర్ఎస్ అభ్యర్ధిని గెలిపిస్తే ఒక లక్ష అరవై వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తి చేయడమే కాకుండా ప్రైవేట్ రంగంలో 17లక్షల ఉద్యోగాలు భర్తి చేయడం జరిగిందన్నారు.పెద్దల సభకు విద్యార్థి ,నిరుద్యోగ మరియు ఉద్యోగుల సమస్యలపై గలమేత్తే సరైన అభ్యర్దిని పంపడంలో బాద్యత గల గ్రాడ్యుయేట్ లుగా మనవంతు కృషి చేయాలన్నారు. మరి ముఖ్యంగా ప్రభుత్వాన్ని నిక్కచ్చిగా ప్రశ్ని%శీ%చడంలో ముందుండే గొంతును ప%శీ%పడం పై గ్రాడ్యుయేట్‌లను జాగృతం చేయాలన్నారు. త్వరలో నిర్వహించబోయే పట్టభద్రుల ఎమ్మెల్సి ఉప ఎన్నికల్లో ఓటుహక్కు కోసం ఈ నెల పిబ్రవరి 6 లోపు నమోదు చేసుకోవాలన్నారు.ఓటు హక్కు నమోదు కోసం ఆన్లైన్ మరియు ఆఫ్ లైన్ లో అప్లై చేస్కొనే సదుపాయం ఉందని,2020 సం.. నవంబర్ లోపు గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారు అర్హులు అని తెలిపారు. 2014లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 10 ఏళ్లలో 1 లక్ష 61 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, గత రెండు నెలలుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేతనాలు వేస్తుందో లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ ప్రభుత్వ హాయంలో స్టాఫ్ నర్స్ ఉద్యోగాల పరీక్షలు నిర్వహించామని, ఎన్నికల కోడ్ వల్ల నియామక పత్రాలు ఇవ్వడం ఆలస్యం అయిందని, తామే స్టాఫ్ నర్స్ ఉద్యోగాలను భర్తీ చేసినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం నియామక పత్రాలను ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలపై స్పష్టతనిచ్చి, వెంటనే భర్తీ చేయాలని కోరారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బిఆర్ఎస్ జెండాను ఎగరవేయడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో 50 కోట్ల ఎస్ డీ ఎఫ్ నిధులుతో వివిధ కుల సంఘాలకు కమ్యూనిటీ భవనాలు మరియు రోడ్లు మంజూరు చేపిస్తే వాటిని కావాలని ఆపాలని చూస్తున్నారని ప్రజల సౌకర్యార్థం మంజూరు చేసిన ఆ నిధులను కొనసాగించాలన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన మంత్రి కొండా సురేఖ కృషి

- రూ. 200 కోట్లతో వరంగల్ జిల్లాలో ఏర్పాటు కానున్న టెక్నికల్ సెంటర్ (హబ్) ...
- టెక్నికల్ సెంటర్ ను వరంగల్ జిల్లాలో స్థాపించేందుకు రాష్ట్ర మంత్రివర్గాన్ని ఒప్పించిన మంత్రి సురేఖ..
- యావత్ తెలంగాణలోనే ఏకైక టెక్నికల్ సెంటర్ కేంద్రంగా వరంగల్ ...
- వేలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్న టెక్నికల్ సెంటర్...
- వరంగల్ జిల్లా ప్రజల్లో హర్షాతిరేకాలు...
- మంత్రి సురేఖకు అభినందనల వెల్లువ....



**తరంగాలు /హన్మకొండ ప్రతినిధి** వరంగల్ నగర పురోభివృద్ధికి రాష్ట్ర పర్యావరణ,అటవీ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. ఇదే కోవలో వరంగల్ జిల్లాలో టెక్నికల్ సెంటర్ ఏర్పాటుకు మంత్రి చేసిన ప్రయత్నాలు ఫలించాయి.కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 20 టెక్నికల్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించగా, అందులో ఒక టెక్నికల్ సెంటర్ (హబ్) వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలంలోని రంగశాయి పేటలో ఏర్పాటు కానుందనే వార్త వరంగల్ ప్రజలకు గొప్ప ఊరటను కలిగిస్తున్నది. మూడు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవంతో మంత్రి సురేఖ పట్టుదలతో చేసిన ప్రయత్నాలతో వరంగల్ లో టెక్నికల్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర మంత్రిమండలి అంగీకారం తెలిపింది.ఈ టెక్నికల్ సెంటర్ భవన నిర్మాణం, ప్లాంట్, యంత్రాల కూర్పు మొదలైన వాటి కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 200 కోట్లను పెట్టుబడిగా పెట్టనుంది. వరంగల్ లో స్థాపించనున్న ఈ సెంటర్ ను విశేషమైన సామర్థ్యంతో నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అధునాతన సాంకేతికను సమకూర్చడం,నైపుణ్యం కలిగిన మానవ వనరుల సృష్టి, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక,వ్యాపార సలహాలు అందించడం వంటి అంశాల్లో ఈ టెక్నికల్ సెంటర్ ప్రభావవంతమైన పాత్ర పోషించున్నది. పలు రకాల పరిశ్రమలకు అవసరమైన సేవలను అనుసరించి టెక్నికల్ సెంటర్ శిక్షణ కార్యక్రమాలను చేపడుతుంది.నిర్మాణ,ఎలక్ట్రికల్,ఫౌండ్రీ, లెదర్,గ్లాస్, స్పోర్ట్స్ వంటి వివిధ రంగాలకు టెక్నికల్ సెంటర్లు సేవలను అందిస్తాయి.టెక్నికల్ సెంటర్ ఏర్పాటు వరంగల్ జిల్లా చరిత్రలో మైలురాయిగా నిలువనుంది. వేలాది మందికి ఉద్యోగ,ఉపాధి అవకాశాలను కల్పించే టెక్నిలక్ సెంటర్ (హబ్) ఏర్పాటు ప్రకటనతో వరంగల్ జిల్లా ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పట్టుదలతో వరంగల్ లో టెక్నికల్ సెంటర్ స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించిన మంత్రి సురేఖను ప్రజలు మనసారా అభినందిస్తున్నారు.



## పారదర్శకంగా ఈ.వి.ఎం. యంత్రాల ఎఫ్.ఎల్.సి నిర్వహణ

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల...

**తరంగాలు/భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:** పారదర్శకంగా ఈ.వి.ఎం. యంత్రాల ఎఫ్.ఎల్.సి నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. సోమవారం కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణం, అలాగే లక్ష్మీ దేవిపల్లి మండలంలోని శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూములతో పాటు ఈవిఎం, వి.వి ఫ్యాట్ గోదామును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఫిబ్రవరి 5వ తేదీ నుండి 15 వ తేదీ వరకు వివిద రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వీడియో గ్రఫీ, సి సి కెమెరాల మధ్య ఎఫ్ ఎల్.సి ఫస్ట్ లెవెల్ చెకప్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించ నున్నట్లు చెప్పారు. ఈ.వి.ఎం. యంత్రాలను ఎఫ్.ఎల్.సి(ఫస్ట్ లెవల్ చెకింగ్) ఈసీఐఎల్ ఇంజనీర్ల పర్యవేక్షణలో నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో ఈ.వీ.ఎం యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. భారత ఎన్నికల సంఘం మన జిల్లాకు 1588 బ్యాలెట్ యూనిట్లు, 1424 కంట్రోల్ యూనిట్లు, 1683 వి.వి.ప్యాట్ యంత్రాలు కేటాయించినట్లు చెప్పారు. అంతకు ముందు వివి ఫ్యాట్, ఈ వి ఎం గోదాములో ఈ.వి.ఎం యంత్రాలను, గోదాం సీల్, సిసి కెమెరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఎన్నికల విభాగం తహసీల్దార్ దారా ప్రసాద్, కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, నాయబ్ తహసీల్దార్ రంగా ప్రసాద్, ఈ.సి.ఐ.ఎల్.ఇంజనీర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు , ఎలక్షన్ సిబ్బంది నవీన్, అశోక్, వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఈవీఎంల తనిఖీలు నిర్వహించాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల తనిఖీలు
- జిల్లా కలెక్టర్ వి పి గౌతమ్



**తరంగాలు /ఖమ్మం జిల్లా బ్యూరో : ఖమ్మం :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో సోమవారం నుండి పారదర్శకంగా ఇవిఎం యంత్రాల మొదటి స్థాయి తనిఖీలు (ఫస్ట్ లెవల్ చెకింగ్) ఈసీఐఎల్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. సోమవారం నూతన కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోడౌన్ వద్ద ఇవిఎం యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పార్లమెంటు ఎన్నికల నిర్వహణకు ఇవిఎం ల సిద్ధం కొరకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాకు వచ్చిన 3794 బ్యాలెట్ యూనిట్లు,1920 కంట్రోల యూనిట్లు, 2263 వి.వి. ప్యాట్ యంత్రాల పనితీరు పరిశీలించడం జరుగుతుందని అన్నారు. ఇవిఎం ల ఎఫ్.ఎల్.సి. పై మూడు రోజుల క్రితమే అన్ని రాజకీయ పక్షాలకు సమాచారం అందించామని తెలిపారు. సోమవారం నుండి, ప్రతిరోజు ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 7.00 గంటల వరకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి పారదర్శకంగా ప్రక్రియ చేపట్టబడునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, ఖమ్మం, కల్లూరు ఆర్డీవోలు జి. గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్డీసి రాజేశ్వరి, తహశీల్దార్లు, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పి. శ్రీనివాస్, బిజెపి పార్టీ ప్రతినిధి జిఎస్ఆర్ఏ. విద్యాసాగర్, సీపీఐ(ఎం) పార్టీ ప్రతినిధులు పున్నయ్య, ఆర్. ప్రకాష్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి పువ్వళ్ల దుర్గాప్రసాద్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి ఫ్రాన్సిస్ , టిడిపి పార్టీ ప్రతినిధులు వాసిరెడ్డి రామనాథం, కె. కరుణాకర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# నర్సంపేట జిల్లా ఆసుపత్రిలో వైద్య కళాశాల నిర్వహణకు మౌలిక వసతులు సమకూర్చండి

- మెడికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ విమల ధామస్
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తో కలసి అధికారులతో సమీక్ష

**తరంగాలు /వరంగల్ జిల్లా ప్రతినిధి:** నర్సంపేట ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన విమల ధామస్ నర్సంపేట జిల్లా ఆసుపత్రి లో మెడికల్ కాలేజ్ మొదటి సంవత్సరం నిర్వహణకు మౌలిక వసతులు వెంటనే సమకూర్చాలని రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ విమల ధామస్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తో కలసి 250 పడకలతో నిర్మాణంలో ఉన్న జిల్లా ఆసుపత్రి నర్సంపేట పనుల పురోగతి పై,ఆసుపత్రిలో తాత్కాలికంగా మెడికల్ కాలేజ్ నిర్వాహనకు మౌలిక సదుపాయాల కల్పన పై నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి తెలంగాణ రాష్ట్ర వైద్య సేవల మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఎస్‌సి దేవేందర్ కుమార్, డీఈ రాజశేఖర్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ కిషన్, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా నర్సంపేట జిల్లా ఆసుపత్రి మ్యాప్ ను పరిశీలించి బ్లాక్ వైస్ ఆసుపత్రి, మెడికల్ కాలేజ్ నిర్వహణపై తగు సూచనలు చేశారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి వైద్య కళాశాలలో తరగతులు, ఆసుపత్రి ఏప్రిల్ నెలలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 250 పడకలతో నిర్మాణంలో ఉన్న నర్సంపేట జిల్లా ఆసుపత్రిలోని 3 బ్లాక్ లలో ఒక బ్లాక్ కళాశాల కొరకు 2 బ్లాక్ లతో నర్సంపేట ఏరియా ఆసుపత్రి కి వినియోగించాలని అన్నారు.అనంతరం విమల ధామస్ నర్సంపేట ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిత్యం పర్యవేక్షిస్తూ నిర్దేశిత గడువులోగా నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

# ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు ఎఫ్ఎల్‌సీ నిర్వహణ

- వరంగల్ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**తరంగాలు /వరంగల్ జిల్లా ప్రతినిధి** వచ్చే 2024 లోక సభ ఎన్నికల్లో వినియోగించనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు సంబందించి ఫస్ట్ లెవెల్ చెకింగ్(ఎఫ్ఎల్‌సీ) నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. సోమవారం వరంగల్ ఎనుమాముల మార్కెట్ యార్డ్ లో భద్రపరిచిన వరంగల్ తూర్పు,వర్ధన్నపేట,నర్సంపేట నియోజకవర్గాల ఈవీఎంలను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల సమక్షంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నేటి నుండి ఫిబ్రవరి14వ తేదీ వరకు ఈవీఎం,వివి ప్యాడ్ లను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి దశ తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను సీసీ కెమెరాలతో రికార్డు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఎలక్షన్ కమిషన్ ఈ ప్రక్రియను లైవ్ వెబ్‌కాస్టింగ్ ద్వారా చూసేలా ఏర్పాట్లు చేశామన్నారు.జిల్లా రెవెన్యూ అధికారి నోడల్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఎఫ్ఎల్‌సీ నిర్వహణ జరుగుతున్నదని అన్నారు.ఈవీఎంలలో సాంకేతిక లోపాలను నిపుణులు పరిశీలిస్తారన్నారు. ఈవీఎంల గోడౌన్ వద్ద ఎఫ్ఎల్‌సీ నిర్వహణ ఏర్పాట్లు, బందోబస్తు,వెబ్‌కాస్టింగ్‌ను కలెక్టర్ పరిశీలించారు.రోజూ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ కొనసాగుతుందని, ఈవీఎం గోడౌన్ ప్రాంగణంలోకి రాకపోకలను నియంత్రించేలా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు.పూర్తిగా తనిఖీ చేసిన తర్వాత మాత్రమే గుర్తింపు కార్డులు ఉన్న వారిని ప్రాంగణంలోకి అనుమతిస్తారని స్పష్టం చేశారు.మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించేది లేదన్నారు.ఎఫ్ఎల్‌సీలో పాల్గొనే సిబ్బందికి భోజన, ఇతర సౌకర్యాలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి డి ఆర్ ఓ వాసు చంద్ర,ఏసీపీ సతీష్ బాబు,ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఐ ఎన్ సి నుండి మీసాల ప్రకాష్,ఈ వి శ్రీనివాస్,టిడిపి నుండి శ్యామ్ వైయస్సార్సీపి నుండి రజినీకాంత్ ఏఐఎంఐఎం నుండి ఫైజుల్లా బిఎస్పీ నుండి అనిల్ కుమార్,ఐ బి పి పరం జ్యోతి,తహసిల్దార్లు, ఇంజనీర్లు,రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.